
కలశాలతో కదిలారు



కలశాలతో దేవాలయానికి తరలిన మహిళలు

పెద్దదోర్నాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐనముక్కల గ్రామంలోని శ్రీగణపతి, పోతురాజు సహిత పోలేరమ్మ, అభయాంజనేయ స్వామి, అంకాళమ్మ దేవాలయాల్లో మూడో వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు కాకర్ల లక్ష్మీప్రసాద్ గణపతి పూజ, పుణ్యాహవచన, పంచామృత అభిషేకం, నవగ్రహ హోమం చేశారు. అనంతరం పోలేరమ్మ, అంకాళమ్మ అమ్మవార్లకు మహిళలు పెద్దఎత్తున కలశాలతో జలాలు తెచ్చి జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని, ప్రజలు, పశుసంపద ఆరోగ్యంగా ఉండాలని గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

అలా వదిలేశారు!

గత వైసీపీ పాలకుల నిర్వాకంతో నేడు ఒంగోలు కార్పొరేషన్ ఖజానాకు భారీగా గండి పడింది. కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని దుకాణాలకు సంబంధించి సుమారు రూ.27కోట్ల మేర అద్దె బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వ ఆస్తులు పరుల చేతుల్లోకి వెళ్లాయి. కొందరు వ్యాపారులు బినామీలుగా తిష్ట వేయగా, నాటి పాలకుల అండదండలతో షాపులు దక్కించుకున్న పలువురు కార్పొరేషన్‌కు అద్దెలు చెల్లించకుండా అడ్డం తిరుగుతున్నారు. ఇంకొందరు ఏకంగా దుకాణాలను అమ్ముకున్నారు. అలాంటి వారి నుంచి ఇప్పుడు అద్దె బకాయిలు వసూలు చేయడం తలనొప్పిగా మారింది. కొన్నిచోట్ల షాపుల లీజు గడువు పూర్తయినప్పటికీ దర్జాగా అనుభవిస్తున్నారు. గతంలో కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో పనిచేసిన వారి కాసుల కక్కుర్తి కూడా ఈ పరిస్థితికి కారణమైంది.

ఒంగోలు నగర పరిధిలో ఉన్న మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్



రూ.27కోట్ల మేర అద్దె బకాయిలు

- వైసీపీ పాపం.. ఖజానాకు శాపం..!
- పేరుకుపోయిన కార్పొరేషన్ దుకాణాల అద్దె బకాయిలు
- కూరగాయల మార్కెట్‌లో రూ.12 కోట్లు!
- షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి రూ.15కోట్లు పెండింగ్
- కొన్నింటికి లీజు గడువు పూర్తయినా పట్టించుకోని వైనం
- ఇతరులకు అమ్ముకొన్న కొందరు
- కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి
- చోద్యంచూస్తున్న రెవెన్యూ విభాగం

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ పరిధిలో ఉన్న దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్, ఇతర షాపింగ్ కాంప్లెక్స్‌లలోని షాపులకు సంబంధించి దీర్ఘకాలికంగా పేరుకుపోయిన బకాయిలపై ఇటీవల రెవెన్యూ విభాగం అధికారులు దృష్టి సారించారు. ఈ సందర్భంగా అవాక్కయ్యే నిజాలు వెలుగు చూశాయి. గత ఐదేళ్లుగా అద్దె వసూళ్లు, దుకాణాల పర్యవేక్షణ గాలికొదిలేసినట్లు తేలింది. ఒక్క దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లోనే సుమారు రూ.12 కోట్ల బకాయిలు బయటపడ్డాయి. మిగిలిన మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల బకాయిలు మరో రూ.15 కోట్ల వరకు ఉన్నట్లు సమాచారం. గతంలో అద్దెలు చెల్లించిన సొమ్మును కొందరు ఆర్‌ఐలు సొంతానికి వాడుకోగా, మరికొందరు దుకాణదారులు అసలు అద్దెలు చెల్లించకుండానే దర్జాగా అనుభవిస్తున్నారు.

ప్రభుత్వ షాపులను అమ్మేసుకున్నారు!

కార్పొరేషన్ కాంప్లెక్స్‌ల్లో గతంలో షాపులు దక్కించుకున్న వారిలో కొందరు వాటిని అమ్మేసుకున్నారు. ఇప్పుడు వారి నుంచి అద్దె బకాయిలు రాబట్టడం కష్టతరంగా మారింది. షాపులు అమ్ముకున్న వారి పేరుతోనే నేటికీ బకాయి ఉండగా, తమకు సంబంధం లేదని కొందరు తెగేసి చెప్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దుకాణాల విక్రయాలు జోరుగా సాగినా పట్టించుకున్న పాపాన పోలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. అసలు ప్రభుత్వ ఆస్తులను ఎలా అమ్ముతారు? అని ప్రశ్నిస్తున్న అధికారులు చర్యలకు మాత్రం వెనకడుగు వేస్తున్నారు. మరికొందరు నాటి వైసీపీ పెద్దల ఆశీస్సులతో షాపులు దక్కించుకుని అద్దెలు చెల్లించకుండా దర్జాగా అనుభవిస్తున్నారు. దీంతో కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దె వసూలు అధికారులకు తలనొప్పిగా మారింది.



ఏళ్ల తరబడి తిష్ట

25 సంవత్సరాల లీజుకు తీసుకున్న కొన్ని కాంప్లెక్స్‌ల్లోని షాపులకు 2022 నాటికి గడువు పూర్తయ్యింది. వాటిని రెన్యువల్ చేయకుండా గతంలో పనిచేసిన కార్పొరేషన్ ఆర్‌ఐలు కప్పిపెట్టారు. కూరగాయల మార్కెట్‌లో షాపులను 30శాతం అద్దె పెంపుతో రెన్యువల్ చేయాల్సి ఉండగా అది కూడా జరగలేదు. గడిచిన ఐదేళ్లుగా అద్దె బకాయిల వసూలు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. గుర్తుకు వచ్చినప్పుడల్లా మొక్కుబడి నోటీసులతో సరిపెట్టిన రెవెన్యూ యంత్రాంగం నేటికీ దుకాణాలను స్వాధీనం చేసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేషన్ రెవెన్యూ విభాగం వారు దుకాణాల నిర్వాహకుల నుంచి అద్దె వసూలు చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. నాలుగు నెలల క్రితం సదరు ఆపరేటర్ సీటు మార్చడంతో ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు. దీంతో లెక్కాపక్కా లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి అద్దె బకాయిలు వసూలు చేయడంతోపాటు, లీజు ముగిసిన షాపులను స్వాధీనం చేసుకోవడం కానీ, రెన్యువల్ కానీ చేసి కార్పొరేషన్ ఖజానాకు ఆర్థిక పరిపుష్టి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గడువు పూర్తయినా కదలని లీజుదారులు

కొన్ని షాపులను అధికారులు లీజు పద్ధతిన కేటాయించారు. అప్పట్లో లీజు పొందిన వారు గడువు పూర్తయినా కదలనంటున్నారు. అమరజీవి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 25 షాపులు, అద్దంకి బస్టాండ్ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 25, టీఎల్ఎన్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 12, జయరాం హాలు సమీపంలోని కాంప్లెక్స్‌లో 3, లాయరుపేట మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 40 దుకాణాలు, ఘోష ఆసుపత్రి వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో 15 షాపులు 25 సంవత్సరాల లీజు పద్ధతిన కేటాయించారు. కూరగాయల మార్కెట్‌లో ఐదు సంవత్సరాల లీజు పద్ధతిన హోల్ సేల్ షాపులు 69, రిటైల్ షాపులు 123, పండ్ల దుకాణాలు 38, పూల దుకాణాలు 28, చేపల దుకాణాలు 25, మాంసం మార్కెట్‌లో 25 షాపులను కేటాయించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు

- రేషన్ షాపుల్లో తనిఖీలు
- ఏడుగుండ్లపాడులో అదనంగా బియ్యం ఉన్న దుకాణం సీజ్
- టంగుటూరులో ఒకరు, కేతగుడిపిలో మరో డీలర్‌పై 6ఏ కేసు



టంగుటూరులో రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలుచోట్ల రేషన్ దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. డీలర్లు కార్డుదారులకు సరుకులు కాకుండా నగదు ఇస్తున్నారని ఫిర్యాదులు రావడంతో విస్తృత తనిఖీలు చేపట్టారు. మద్దిపాడు, టంగుటూరు, తర్లుపాడు మండలాల్లో ఇవి జరిగాయి. మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులోని రేషన్‌షాపులో ఒంగోలునగరం, ఒంగోలు రూరల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, రాజేష్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కాశీ, వంశీలు తనిఖీలు నిర్వహించారు. 44 బస్తాల బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించారు. దీనిపై డీలర్ ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడంతో ఆ షాపును సీజ్ చేసినట్లు సమాచారం. టంగుటూరులో ఒక రేషన్ షాపుపై కూడా ఫిర్యాదులు రావడంతో దాడులు చేశారు. అక్కడ ఉన్న బియ్యానికి, రికార్డుల్లో ఉన్న దానికి 200 కిలోల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి డీలర్‌పై కేసు నమోదు చేశారు. తర్లుపాడు మండలం కేతగుడిపి రేషన్‌షాపు డీలర్ కార్డుదారుల ఇంటి వద్దకే వెళ్లి వేలిముద్రలు వేయించుకొని నగదు ఇచ్చే దృశ్యాలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో అధికారులు ఆ షాపులో తనిఖీలు చేపట్టారు. నిల్వల్లో భారీగా తేడాలు ఉండటంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. ఇలా అనేక ప్రాంతాల్లోని ఫిర్యాదులు వస్తుండటంతో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ఎంఈవోల నియామక విధానంపై నిరసన గళం

- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నిర్ణయం
- న్యాయ పోరాటానికి నిర్ణయం

ఒంగోలు విద్య, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాధికారులు-1గా కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్ఎంలు, స్కూలు అసిస్టెంట్లను నియమించడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన గళం వినిపించేందుకు సిద్ధమయ్యారు. స్థానిక ప్రధానోపాధ్యాయుల సంఘ భవన్‌లో ఆదివారం ఫ్యాప్టో, జాక్టో, ప్రధానోపాధ్యాయుల సంఘం, ఎంఈవోల సంఘం ఉమ్మడిగా ఐక్యవేదికను ఏర్పాటు చేశాయి. సమావేశంలో పాల్గొన్న నాయకులు భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు. ఉమ్మడి ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపట్టడంతోపాటు ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ న్యాయ పోరాటానికి కూడా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒకే డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లను ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో ఖాళీలను బట్టి నియమిస్తారన్నారు. వీరిలో ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్ఎంలు, స్కూలు అసిస్టెంట్లను మాత్రమే రెగ్యులర్, ఇన్‌చార్జి ఎంఈవో-1లుగా నియమిస్తూ పంచాయతీరాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సరికాదన్నారు. కేవలం ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 2005లో ప్రభుత్వం జారీ చేసిన 205, 208 జీవోల ప్రకారం నియామకాలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు పులి శ్రీనివాసరావు, నరహరి అంజిరెడ్డి, మల్లికార్జునరావు, అబ్దుల్ హై, రఘు, సుబ్బారావు, శ్రీనివాసరావు, పర్రె వెంకట్రావు, వై.వెంకట్రావు, జీఎస్ఆర్ సాయి, శ్రీనివాసరావు, టి.కిషోర్‌బాబు, నాగేంద్రవదన్ పాల్గొన్నారు.




సమావేశమైన పలు సంఘాల నాయకులు

సాగర్ కాలువలకు పుష్కలంగా నీరు

- వరినాట్లకు సిద్ధమవుతున్న రైతులు

దర్శి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కాలువలకు పుష్కలంగా నీరు సరఫరా అవుతోంది. ఈ ఏడాది ఇప్పటికే శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు పూర్తిగా నిండిన విషయం విదితమే. ముందుగా సాగుకు మూడు రోజుల క్రితం ప్రభుత్వం సాగర్ కాలువలకు నీరు విడుదల చేసింది. ప్రస్తుతం కుడి కాలువకు డ్యామ్ నుంచి 8,604 క్యూసెక్కులు విడుదల చేయగా బుగ్గవాగుకు చేరుతోంది. అక్కడి నుంచి సాగర్ ప్రధాన కాలువకు 7,260 క్యూసెక్కులు వస్తోంది. అందులో గుంటూరు బ్రాంచ్ కాలువకు 1,300 క్యూసెక్కులు, అద్దంకి బ్రాంచ్ కాలువకు 3,305 క్యూసెక్కులు, సాగర్ ప్రధాన కాలువ (ప్రకాశం బోర్డర్) అయిన 85/3 మైలు వద్ద 2,406 క్యూసెక్కులు సరఫరా అవుతోంది. ఒంగోలు బ్రాంచ్ కాలువకు వచ్చే సరికి 1,284 క్యూసెక్కుల నీరు పంపిణీ అవుతోంది. దీంతో ఆయకట్టు భూముల్లో వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. బోర్ల వసతి ఉన్న వారు గతంలోనే నార్లు పోసి ఉండటంతో ప్రస్తుతం నాట్లు వేస్తున్నారు. మిగిలిన ఆయకట్టు రైతులు ఇప్పుడు నార్లు పోస్తున్నారు. ఈ ఏడాది సాగర్ జలాలు అనుకున్న సమయానికంటే ముందుగానే విడుదలవ్వడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.



ఒంగోలు బ్రాంచ్ కాలువలో పుష్కలంగా ప్రవహిస్తున్న సాగర్ జలాలు



మరో వేసవి

- సాధారణం కన్నా ఐదారు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు
- పలుచోట్ల 40 డిగ్రీలకు చేరువలో..
- రాష్ట్రంలోనే గరిష్ఠంగా జిల్లాలో నమోదు

ఒంగోలు ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రస్తుత వాతావరణం మరో వేసవిని తలపిస్తోంది. చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా ఐదారు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్నిచోట్ల ఏకంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువలో ఉండటమే కాక రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలోనే ఉంటున్నాయి. ఆదివారం అనేక ప్రాంతాల్లో 37నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడం అందుకు నిదర్శనం. సాధారణంగా ఈసమయంలో వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం వరకు 32నుంచి 35 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అనంతరం మబ్బులు పట్టి వాతావరణం చల్లబడి సాయంత్రానికి జల్లులు కురుస్తుంటాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలు సేద తీరుతారు. పల్లెల్లో పొలం పనులు ముమ్మరంగా సాగుతుంటాయి. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది.

వారం రోజులుగా పెరుగుతున్న తీవ్రత

వారం రోజులుగా జిల్లాలో వానజాడ కరువైంది. క్రమంగా ఎండలు మండిపోతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం అత్యధిక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 37 డిగ్రీలపైనే ఉండగా పలుచోట్ల 40 డిగ్రీలకు చేరువలో నమోదయ్యాయి. జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో రాష్ట్రంలో ఐదారు స్థానాల్లో మండల కేంద్రమైన కొనకనమిట్లలో 39.62 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆ సమయంలో కనిగిరి మండలం నందనమారెళ్లలో 39.28, పామూరు మండలం బొట్లగూడూరులో 39.20డిగ్రీలుగా ఉంది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రాష్ట్రంలోనే అత్యధికంగా పొదిలి మండలం ఉప్పలపాడులో 39.44 డిగ్రీల ఎండ కాచింది. పొన్నలూరు మండలం చెరువుకొమ్ముపాలెంలో 39.20 డిగ్రీలు నమోదైంది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో రాష్ట్రంలో రెండో స్థానంలో కొనకనమిట్లలో 39.41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆ సమయంలో కూడా చాలా మండలాల్లో 37 డిగ్రీల కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు ఉండటం ఎండ తీవ్రతను తెలియజేస్తోంది. ఇక ఒంగోలులో 38 డిగ్రీలు నమోదైంది. సాయంత్రం తర్వాత కూడా చాలా ప్రాంతాల్లో వేడి వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

గ్రానైట్ క్వారీల్లో ప్రమాద ఘంటికలు

బల్లికురవ ఘటనతో మైన్స్ అధికారుల అప్రమత్తం

విస్తృత తనిఖీలకు రంగం సిద్ధం

7



పోలీసులకు జలక్

ఒంగోలులో పోలీసుల నుంచి దొంగ పరారీ

అదే రోజు రాత్రి ఐదు దుకాణాల్లో చోరీ

7

జ్యోతిష్య జ్ఞానసింధు బిరుదు ప్రదానం


వెంకటరమణయ్యశర్మకు అవార్డును ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ రుద్రరాజు, శివాజీరాజా

జరుగుమల్లి/కొండపి, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ జ్యోతిష్యుడు, నర్సింగోలు శనీశ్వర ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ పైడిపాటి వెంకటరమణయ్యశర్మకు మరో పురస్కారం లభించింది. హైదరాబాద్ లలిత కళా సమాఖ్య సేవా సామాజిక సాంస్కృతిక సంస్థ స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణకంకణ అవార్డులలో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జ్యోతిష్య జ్ఞాన సింధు బిరుదును ప్రదానం చేసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీడీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు అందజేశారు. కార్యక్రమంలో సినీ నటుడు శివాజీరాజా, సీవీ రామన్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వరరావు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రత్తమ్మకు నివాళులు


నివాళులర్పిస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

కొండపి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పెట్లూరు మాజీ సర్పంచ్ మూలె రత్తమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆదివారం హాజరయ్యారు. రత్తమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మూలె రామారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సేవల పెంపుపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో సామాజిక సేవల పెంపుపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆదివారం పార్లమెంట్‌లో ప్రశ్న వేశారు .దీనిపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయక మంత్రి సురేష్‌గోపీ సమాధానం ఇస్తూ ప్రభుత్వ రంగ సంస్థలు- కంపెనీలు లాభాలనే కాకుండా సామాజిక, పర్యావరణ; దాతృత్వ, నైతిక ఆర్థిక రంగాల సుస్థిరతకు పాటుపడుతున్నాని తెలిపారు. ప్రకాశం జిల్లాలో పలు ప్రభుత్వరంగ సంస్థలు ఆరోగ్యం, విద్యుత్, విద్య, గృహాలు, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, మహిళాభివృద్ధి, పర్యావరణం, వృద్ధులు, మత్స్యకార తదితర సంఘాలకు, దివ్యాంగులకు సంబంధించి సుస్థిరతను సాధించేందుకు పలు ప్రాజెక్టులను చేపట్టాయని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల పాలకమండళ్లు వాటి నిర్వహణకు అధికారాలు కలిగి ఉంటాయని కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాగి తీగ చోరీ

ఎర్రగొండపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్లవీడపి గ్రామ పొలాల్లో వ్యవసాయ బోరు వద్ద అలవాల బ్రహ్మారెడ్డి, పోలేబోయిన పెద్దన్న రైతులకు చెందిన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగ చోరీకి గురైన ఘటన శనివారం రాత్రి జరిగింది. బాధిత రైతులు పొలం వద్దకు వెళ్లగా బోరు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి ఉంది. అందులోని రాగి తీగను అపహరించుకుపోయారని రైతులు విద్యుత్ ఏఈకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఏఈ అల్లూరయ్య ఎర్రగొండపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రెండు రోజుల కిందట ఇదే గ్రామ పొలాల్లో మరో రైతు పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి తీగను దొంగిలించారని ఏఈ అల్లూరయ్య తెలిపారు.

యువకుడికి గాయాలు

పొదిలి ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలోని మాదిరెడ్డిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం జరిగింది. పొదిలి మండలం సలకనూతల ఎస్సీ కాలనీకి చెందిన బండి ఏసయ్య మోటార్‌సైకిల్‌పై వస్తూ అదుపుతప్పి మైలురాయికి ఢీకొనగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రుడిని పొదిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

కూల్‌డ్రింక్ షాపులో మద్యం సీసాలు

త్రిపురాంతకం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రామసముద్రంలో కూల్‌డ్రింక్ షాపులో మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి 10 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. వై.పాలంక వీరయ్యను అదుపులోకి తీసుకుని బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు.

11 సీట్లకే పరిమితం చేసినా బుద్ధి రాలేదు

- టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని
- వైసీపీ నేతల తీరుపై ధ్వజం


మాట్లాడుతున్న బాలాజీ

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసినా ఆ పార్టీ నేతల్లో ఇంకా బుద్ధి రాలేదని టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడును విమర్శించే ముందు వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఆదివారం ఒంగోలులోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం దర్శిలో జరిగిన అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభం సందర్భంగా విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే అర్హత బూచేపల్లికి లేదని తెలిపారు. రైతులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని, అందులో భాగంగా రైతులకు ఏడాదికి రూ.20వేలు ఇస్తుందని చెప్పారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని నష్టాల ఊబిలోకి నెట్టేసి, అప్పులభారం నెత్తిన పెట్టిందన్నారు. విజన్ కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకవైపు ఆర్థికలోటు బడ్జెట్‌ను అధిగమిస్తూ, మరోవైపు ప్రజా సంక్షేమం కోసం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే హామీలన్నీ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. పరామర్శల పేరుతో మాజీ సీఎం జగన్ పర్యటనలు చేస్తూ నోటికొచ్చినట్లు మాట్లాడుతూ వీధిరౌడీలా ప్రవర్తిస్తుంటే అవి మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గత వైసీపీ పాలనలో మంత్రులు మాట్లాడిన మాటలు మర్చిపోయారా అన్నారు. తాము ఎక్కడా కక్ష సాధింపులకు పాల్పడటం లేదని, రాజ్యాంగబద్ధంగా ముందుకెళుతున్నామని ఆయన తెలిపారు.

విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు
- జీవో ప్రతుల దహనం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను నిరసిస్తూ ఆదివారం స్థానిక మిరియాలపాలెం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయ కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల కోసం, విద్యారంగంలో జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తాయని తెలిపారు. అయితే విద్యార్థి సంఘాలపై నిషేధం విధించడం ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్యగా ఉందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలన్నీ కూటమి ప్రభుత్వ నాయకులవేనని, వారు విద్యా వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. వారి మేలు కోసమే ప్రభుత్వం ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. తక్షణమే ఈ జీవోను రద్దు చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తోందని హెచ్చరించారు. అనంతరం జీవో కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు సీహెచ్.పవన్‌కళ్యాణ్, సభ్యులు సాధిక్‌బాబు, తేజ, చంద్ర, అరుణ్, గణేష్, రాము, తహిద, శ్రావణి, స్రవంతి పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాలపై కుట్ర

విద్యార్థి సంఘాల గొంతులను అణిచివేసే విధంగా ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యార్థి సంఘాలు కొన్ని దశాబ్దాలుగా విద్యార్థుల హక్కుల కోసం, ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణ కోసం అనేక పోరాటాలు చేసి విజయం సాధించాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఏ పార్టీలు ఉన్నా నిస్వార్థంగా విద్యార్థుల హక్కుల కోసం నిలబడేది విద్యార్థి సంఘాలేనని అన్నారు. కుట్రపూరితంగా జారీ చేసిన జీవోలను రద్దు చేయకుంటే ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు.

ప్రజలపై భారాలు మోపుతున్న ప్రభుత్వాలు

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై భారాలు మోపే పాలకవర్గాల నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఎం కేంద్రకమిటీ సభ్యురాలు డి.రమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం సీపీఎం విస్తృత స్థాయి సమావేశానికి పూనాటి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు అత్యంత విలువైన వ్యవసాయభూములను కట్టబెడుతున్నారని విమర్శించారు. రైతులను ఆదుకుంటాని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, దర్శి పంట పొలాల్లో మీటింగ్ పెట్టి కేవలం రూ.5వేలు అకౌంట్లలో వేస్తే సమస్య తీరుతుందా అని ప్రశ్నించారు. రూ.వెయ్యి కోట్లు కేటాయించి వర్జీనియా, బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతుంటే అవేమి పట్టించుకోవడం లేదని విమర్శించారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు కనీస గిట్టుబాటు ధరలు లేక రోడ్డున పడ్డారన్నారు. ట్రూఅప్‌చార్జీలు, సర్‌చార్జీల పేరుతో విద్యుత్ భారాలన్నీ ప్రజలపై మోపారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగులగొట్టండి చెప్పిన నేతలే ఇప్పుడు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తూ ప్రజలను దగా చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు, సయ్యద్‌హనీఫ్, జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం


రంగారాయుడుచెరువు వద్ద వేడుకలు నిర్వహిస్తున్న వాకర్స్


హనుమంతరావు, వెంకయ్యలను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవాన్ని పలు సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులో ఉత్సాహంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో స్థానిక రంగారాయుడుచెరువు వాకింగ్ ట్రాక్ గాంధీబొమ్మ దగ్గర క్లబ్ సభ్యులు, వాకింగ్ మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ రీజనల్ చైర్మన్ నైనాల రామకృష్ణ మాట్లాడుతూ సృష్టిలో రక్తసంబంధం లేకపోయినా మన కోసం ఆలోచించేది స్నేహబంధమని, దీనికి ఎలాంటి బేధాలు లేవని అన్నారు. జరుగుమల్లి తహసీల్దార్ మురళి మాట్లాడుతూ స్నేహబంధం అమృతం కన్నా గొప్పదన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ పబ్బిశెట్టి రాజేష్, కార్యదర్శి ఎన్.ఆనంద్, కోశాధికారి ఎస్.శ్రీనివాసరావు, వాసవి క్లబ్ ఒంగోలు విజన్, జనసేవ ప్రతినిధులు పాల్గొన్నారు.

- స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్థానిక శుభప్రద కమ్యూనిటీ భవనంలో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ ఆర్ఎంపీ హనుమంతరావు, కొల్లా వెంకయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహంకాళి వెంకటశేషయ్య వెంకటశేషయ్య తన చిరకాల మిత్రులను సన్మానించుకోవడం ఎంతో ఆనందం ఉందన్నారు. కార్యక్రమంలో రంగనాథం, కంచర్ల సుబ్బారావు, ఓరుగంటి ప్రసాద్, సముద్రాల సుబ్రహ్మణ్యం, తాతా శ్రీనివాసులు, గుంజి నాగభూషణం, షాకీర్ పాల్గొన్నారు.

ఏటీఎం కార్డుల దొంగ అరెస్ట్

- నిందితుడిపై పలు జిల్లాల్లో కేసులు
- ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు


వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎం కార్డుల దొంగను నెల్లూరు వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుని వివరాలను ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. గత నెల 24వ తేదీ సాయంత్రం నెల్లూరులో నిప్పో సెంటర్ వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రానికి ఓ వృద్ధుడు వచ్చాడు. ఏటీఎం నుంచి నగదు తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండటంతో పక్కనే ఉన్న ఓ వ్యక్తి నగదు డ్రా చేసి ఇస్తానని కార్డు తీసుకుని పిన్ నెంబరు అడిగి తెలుసుకున్నాడు. ఆ తర్వాత మిషన్ నుంచి నగదు రావడం లేదని చెప్పి కార్డు మార్చి వేరే కార్డు వృద్ధుడికి ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత బ్యాంకు ఖాతా నుంచి నగదు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో వృద్ధుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ నవీన్ సిబ్బందితో కలిసి సాంకేతికత ఆధారంగా నిందితుడు ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం వేములపాడు గ్రామానికి చెందిన ముప్పరాజు సురేంద్రగా గుర్తించారు. అతడిని నిప్పో సెంటర్ సమీపంలో పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఏడు ఏటీఎం కార్డులు, రూ.1000 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై మేదరమెట్ల, పొదిలి, గిద్దలూరు, కావలి, కందుకూరు, తెనాలి, గోదావరి జిల్లాలోని ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయని, పలు క్రిమినల్ కేసుల్లోనూ జైలుకు వెళ్లివచ్చాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మార్కాపురం రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయవరం గ్రామంలో వనమాల బ్రహ్మయ్య శరీరంపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దొనకొండ మండలం మల్లంపేట గ్రామానికి చెందిన వనమాల మార్కాపురం మండలం రాయవరం గ్రామానికి చెన్నమ్మతో వివాహం అయింది. తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండంతో చెన్నమ్మ తన పుట్టిల్లు రాయవరానికి వచ్చింది. దీంతో బ్రహ్మయ్య భార్య పుట్టింటికి వెళ్లి తనపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు వెంటనే స్థానిక జిల్లా వైద్యశాలకు తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

పూటుగా మద్యం తాగారు.. మోటార్‌సైకిల్‌ను తగులబెట్టారు..!


మంటల్లో కాలిపోతున్న మోటార్‌సైకిల్

ఒంగోలు క్రైం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): పూటుగా మద్యం తాగిన స్నేహితులు తరువాత గొడవపడి మోటార్‌సైకిల్‌ను పెట్రోలు పోసి తగులబెట్టారు. ఈ సంఘటన ఆదివారం ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్డులోని పాలకేంద్రం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రాజస్థాన్‌కు చెందిన లూనారాయ్, సాయి స్టోన్ ఆర్టిస్ట్‌లో గోవింద్ అనే మేస్త్రీ వద్ద పనిచేస్తున్నాడు. అదేవిధంగా చీమకుర్తి గ్రానైట్స్‌లలో రాజస్థాన్‌కు చెందిన అర్జున్, కిషోర్ పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం అర్జున్, కిషోర్ ఒంగోలు వస్తూ లూనారాయ్‌కి ఫోన్ చేసి మద్యం తాగుదామని చెప్పుకున్నారు. అయితే లునారాయ్ తన మేస్త్రీ గోవింద్ మోటార్‌సైకిల్‌పై వస్తుండగా పాలకేంద్రం వద్ద వరకు వచ్చే సరికి వాహనంలో పెట్రోల్ అయిపోయింది. ఈమేరకు కిషోర్, అర్జున్‌లకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పి వస్తూ పెట్రోలు తీసుకురమ్మని చెప్పాడు. దీంతో వారు ఓ బాటిల్‌లో పెట్రోలు తెచ్చి వాహనంలో పోయలేదు. మోటార్‌సైకిల్ కవర్‌లో పెట్టి ముగ్గురు చీమకుర్తి నుంచి తెచ్చిన మోటార్‌సైకిల్‌పై వెళ్లి మద్యం తాగారు. అక్కడ గొడవపడ్డారు. దీంతో అర్జున్, కిషోర్ మోటార్‌సైకిలపై తిరిగి చీమకుర్తి వెళుతూ పాలకేంద్రం వద్ద ఉన్న లునారాయ్ బైక్ వద్ద ఆగారు. కవర్‌లో ఉన్న బాటిల్ బయటకు తీసి వాహనంపై పెట్రోల్ పోసి తగులపెట్టి అక్కడి నుంచి పరారీ అయ్యారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో క్రేన్ ఆపరేటర్ మృతి


సుబ్బారావు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

పొదిలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొని క్రేన్ ఆపరేటర్ మృతి చెందిన ఘటన ఆదివారం టైలర్స్ కాలనీ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు .. మృతి చెందిన వ్యక్తి చీమకుర్తి మండలం లక్ష్మీపురం రాజుపాలెంకు చెందిన సుబ్బారావుగా గుర్తించారు. పెద్దచెరువు సాగర్ పైపులైన్ నిర్మాణ పనుల్లో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. అయితే మల్లవరం సమీపంలో జరుగుతున్న పనులను ముగించుకొని సుబ్బారావు స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా టైలర్స్ కాలనీ వద్ద ప్రమాదం జరిగింది. అదే సమయంలో ఒంగోలు నుంచి కనిగిరి వైపు వెళ్తున్న వాహనం వేగంగా సుబ్బారావు బైక్‌ను ఢీకొట్టడంతో సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు చెప్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించడం పలువురిని కంట తడిపెట్టించింది.

నలుగురు జూదరుల అరెస్ట్

కొండపి, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): చినకండ్లగుంట గ్రామంలోని శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని శనివారం అర్ధరాత్రి దాటాక దాడి చేసి పట్టుకున్నామని ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. వారివద్ద రూ.16,831 నగదును స్వాధీనం చేసుకుని, కోర్టుకు హాజరు పరిచామని ఆయన వివరించారు.

అలరించిన సినీ సంగీత విభావరి


నివాళులర్పిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్, కళాకారులు

ఒంగోలు కల్చరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ మెలోడీస్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఈవో కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఘంటసాల, ఎస్పీబాలు చిత్రపటాలకు పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్నేహబంధానికి మరే బంధం సాటి రాదని, స్నేహితుల దినోత్సవం జరుపుకోవటం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ గాయని లక్ష్మీతులసిని సత్కరించారు. అనంతరం వై.పూర్ణ, అక్బర్, అనిల్, ఎన్.విజయ్, సూది రమేష్, మొవ్వా నాగేశ్వ రరావు, ఖాదర్, సంజయ్, లక్ష్మీతులసి, శైలజ చిత్ర, సుహాసిని, నాగశ్రీ పలు పాటలు పాడారు. పొన్నూరి వేంకటశ్రీనివాసలు, జి.కృష్ణ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

220 మందికి వైద్య సేవలు

ఒంగోలు కల్చరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఏబీఎం జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం వాకర్స్ కోసం స్థానిక శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 220 మందికి ఉచితంగా పలు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు 45 నిమిషాలు వ్యాయామం చేయటం వల్ల కండరాలు, రక్తప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుందని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తమ ఆస్పత్రిలో ప్రతి నెల మొదటి గురువారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్‌కుమార్, షేక్ ఖాసిం సైదా, గోపి, అనిల్, రజనీకాంత్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టీబీ పట్ల అవగాహన పెంచుకోవాలి

మద్దిపాడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలు టీబీ పట్ల అవగాహన పెంచుకోవాలని మద్దిపాడు పీహెచ్‌సీ టీబీ సూపర్‌వైజర్ చంద్రమౌళి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆరోగ్యకేంద్రంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వ్యక్తులలో టీబీ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో అటువంటి వారిని గుర్తించి దగ్గుతో బాధపడుతుంటే కళ్లెపరీక్షలు చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, దరియా, సుభాషిణి, పద్మ, రజిత, నాగరాజ కుమారి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివరామయ్య

మద్దిపాడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వాహన దారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ శివరామయ్య తెలిపారు. ఆదివారం మద్దిపాడు ప్రధాన సెంటర్‌లో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. వాహన చట్టాన్ని ఉల్లంఘిస్తే వెయ్యి రూపాయలు జరిమానా చెల్లించాల్సి వస్తుందన్నారు. రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, కాలుష్య రహిత ధృవపత్రాలను వాహనదారులు తమ వెంట ఉంచుకోవాలని కోరారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనం ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాలన్నారు.

19నుంచి ఐద్వా మహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కొండపిలో ఈనెల 19,20 తేదీల్లో జరగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఐద్వా కార్యాలయంలో ఆదివారం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ 1936లో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘంగా, వివిధ రాష్ట్రాల్లో ఉన్న మహిళా సంఘాలను కలిపి 1981లో దేశవ్యాప్తంగా ఐద్వాగా ఏర్పడిందన్నారు. ఈనేపథ్యంలో కొండపిలో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షర్మిల, ఉసా రాజ్యలక్ష్మి, నెర్సుల మాలతి, ఎ.ఆదిలక్ష్మి, కె.ప్రసన్న, భావన రాజ్యలక్ష్మి, డి.శారా, కె.రాజేశ్వరి, శాంతకుమారి, కె.అనంతలక్ష్మి, టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వధువులా అబ్బాయి.. వరుడిగా అమ్మాయి..

- మార్కాపురం ప్రాంతంలో వింత ఆచారం
- నాగుల పుట్ట వద్ద వేషధారణ మార్పుతో కొత్త దంపతుల పూజలు
- సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు వైరల్

మార్కాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కొన్ని ఆచారాలు వందల సంవత్సరాలుగా నేటికీ కొనసాగుతున్నాయి. అలాంటి ఓ వింత ఆచారాన్ని మార్కాపురం ప్రాంతంలో యాదవ సామాజికవర్గానికి చెందిన గుమ్మా ఇంటి పేరుగల వాళ్లు నేటికీ కొనసాగిస్తున్నారు. పెళ్లైన తర్వాత నవ దంపతులు ఇరువురు నాగులపుట్ట వద్ద సంతానం కలగాలని పూజలు చేయడం వారికి ఆనవాయితీ. ఈ క్రమంలో అబ్బాయి వధువులా.. అమ్మాయి వరుడి వేషధారణలో బోనాలతో వెళ్లి పూజలో పాల్గొంటారు. గుమ్మా ఇంటి పేరు కలిగిన వాళ్లలో కూడా మూడు తెగలు ఉంటే నేటికీ ఈ ఆచారాన్ని సంద్ర తెగవాళ్లు మాత్రమే పాటిస్తున్నారు. మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామంలో జూలై 30న గుమ్మా వెంకటనారాయణ, గంగమ్మల కుమారుడు నాగార్జునకు ఎర్రగొండపాలెం మండలం బోయలపల్లికి చెందిన సుమిత్రతో పెళ్లి జరిగింది. ఈ సందర్భంగా నాగులపుట్ట వద్ద పూజలు చేస్తున్న వారి వివాహ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.


బోనాలతో పూజకు వెళుతున్న నవ వధూవరులు

నేడు 'పశ్చిమం'లో మంత్రుల పర్యటన

- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
- గిద్దలూరు, కంభం మార్కెట్ కమిటీల ప్రమాణ స్వీకారానికి హాజరు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : వివిధ అభివృద్ధి పనుల ప్రారంభం, గిద్దలూరు, కంభం మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమాలలో పాల్గొనేందుకు మంత్రులు సోమవారం గిద్దలూరు నియోజకవర్గానికి రానున్నారు. మంత్రులతోపాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నాయకులందరూ విచ్చేస్తున్నారు. వారి పర్యటన ఏర్పాట్లను, గిద్దలూరు మార్కెట్ యార్డులో నిర్వహించనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమం, అనంతరం జరగనున్న బహిరంగ సభ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదివారం స్వయంగా పరిశీలించారు. టీడీపీ నాయకులతోపాటు మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సీఐలు సురేష్, రామకోటయ్య, మల్లికార్జున్, ఎస్సైలతో కలిసి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించి చర్చించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, దేవదాయ శాఖ మంత్రి, ఇన్‌చార్జి మంత్రి అయిన ఆనం రామనారాయణరెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఎమ్మెల్యేలు, దర్శి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జిలు ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 9గంటలకు కంభం పట్టణంలోని కందులాపురం సెంటర్‌లో రూ.2.43కోట్ల విలువైన అభివృద్ధి పనులను మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు బేస్తవారపేట పట్టణంలో రూ.1.60కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్లను ప్రారంభించనున్నారు. ఉదయం 10గంటలకు రాచర్ల మండలం మేడంవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. 10.30 గంటలకు గిద్దలూరు మార్కెట్‌యార్డు ఆవరణలో గిద్దలూరు, కంభం మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో, అనంతరం జరిగే బహిరంగ సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తెలిపారు. ఆయా కార్యక్రమాలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఈసందర్భంగా విజ్ఞప్తి చేశారు.


టీడీపీ శ్రేణులు, పోలీసు అధికారులతో కలిసి మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


ఎర్రగొండపాలెం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

వైపాలెం ఏఎంసీ వ్యవహారంపై నేడు హైకోర్టులో విచారణ

- రిజర్వేషన్ మార్చడంపై ఎస్సీ, ఎస్టీ సంఘాల పిటిషన్
- తాను బాధ్యతలు చేపట్టానని తాజా చైర్మన్ ఫిర్యాదు

త్రిపురాంతకం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రిజర్వేషన్ వ్యవహారంపై నేడు హైకోర్టులో విచారణ జరగనుంది. ఏఎంసీ చైర్మన్ పదవి మొదట ఎస్టీలకు కేటాయిస్తున్నట్టు ప్రకటించిన అధికారులు తరువాత దానిని మారుస్తూ ఓసీ జనరల్ కేటగిరీకి ఇచ్చి చేకూరి సుబ్బయ్యను చైర్మన్‌గా నియమిస్తూ ఇచ్చిన జీవో 593ను సవాల్ చేస్తూ ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ ఉద్యోగ సంఘం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆరె రమణయ్య హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన జీవోను సస్పెండ్ చేస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే దీనిపై విచారణను 4వతేదీ సోమవారానికి వాయిదా వేసింది. ఇదిలా జరుగుతుండగానే మళ్లీ బంజారా హక్కుల సంఘం, లంబాడీ సంఘం నేతలు ఇదే విషయంపై పిటిషన్ దాఖలు చేసినట్టు తెలిసింది. ఎస్టీలకు రావలసిన రిజర్వేషన్‌ను మార్చడం సరికాదని, తమ హక్కులను కాలరాయవద్దని వారు కోర్టుకు విన్నవించుకున్నారు. మరోవైపు చైర్మన్‌గా ఉత్తర్వులు దక్కించుకున్న చేకూరి సుబ్బయ్య కూడా తాను ఇప్పటికే పదవీ బాధ్యతలు చేపట్టానని, తన అభ్యర్థననూ పరిగణనలోకి తీసుకోవాలని కోర్టులో పిటిషన్ వేసినట్టు తెలుస్తోంది. ఈ పిటిషన్ల అన్నింటిపైనా 4వ తేదీ సోమవారం విచారణ జరుపుతామని కోర్టు పేర్కొంది. కాగా విచారణ జరగనున్న నేపథ్యంలో నియోజకవర్గంలో దీనిపై ఆసక్తి నెలకొంది.


20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

7న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన

- జిల్లా నలుమూలల నుంచి శ్రేణులను సమీకరించాలి
- 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈనెల 7వతేదీన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని 20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పిలుపునిచ్చారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కార్యక్రమం నిర్వహణపై పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో జరగని విధంగా ప్రకాశం జిల్లాలో రాష్ట్ర అధ్యక్షుడి కార్యక్రమం నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులను పెద్ద ఎత్తున సమీకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు పార్టీ శ్రేణులను సమన్వయంచేసుకొని తీసుకొని రావాలన్నారు. అందుకోసం జిల్లా కేంద్రమైన ఒంగోలులోని పార్టీ ముఖ్యనాయకులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 7వతేదీన రాష్ట్ర అధ్యక్షుడి కార్యక్రమ నిర్వహణ కోసం ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రఅధ్యక్షుడు మాధవ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యమాధవ్ మాట్లాడుతూ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న పథకాలు, కార్యక్రమాల అమలు వల్ల ప్రజల్లో పార్టీ పట్ల ఆదరణ పెరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా లంకా దినకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, పీవీ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు మాకినేని అమరసింహ, అశోక్‌రెడ్డి, జేవీ నారాయణ, రాయపాటి అజయ్‌కుమార్, మంచాల ప్రసాదరావు, ఆషారావు, పి. లక్ష్మి, సీతారామయ్య, డి. శివాజీ, బొద్దులూరి ఆంజనేయులు, రాజేష్ వర్మ, కాటా రాధాకృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

8లోపు దరఖాస్తులు చేయాలి

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు

- 21నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు

ఒంగోలు విద్య, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసేందుకు అర్హులైన టీచర్లు ఈనెల 8లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయిలో ఈ దరఖాస్తులను 11న పరిశీలించి ఒక కేటగిరిలో ముగ్గురు చొప్పున ఎంపిక చేస్తారన్నారు. 12న ఆ జాబితాలను డీఈవోకు పంపుతారన్నారు. ఆ జాబితా నుంచి కేటగిరి నుంచి ఒకరు చొప్పున జిల్లా స్థాయి కమిటీ ఎంపిక చేస్తుంది. 14న తయారైన జాబితాను 15న పాఠశాల విద్యా డైరెక్టర్ కార్యాలయానికి పంపుతారు. ఆ తర్వాత 21నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి 25న తుది జాబితాను ఖరారు చేస్తారు. రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైన వారికి రూ. 20వేలు నగదు, ప్రశంసా పత్రం అందజేస్తారు. జిల్లా స్థాయిలో 20 మంది, మండల స్థాయిలో 16 మందికి మించకుండా టీచర్లను అవార్డులకు ఎంపిక చేయాలని పాఠశాల విద్యాడైరెక్టర్ ఆదేశించినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

పోలీసులకు జలక్

సీసీఎస్ పోలీసుల అదుపులో నుంచి దొంగ పరారీ
అదే రోజు రాత్రి ఆటో నగర్‌లో ఐదు దుకాణాల్లో చోరీ
నిందితుడి కోసం తీవ్రంగా గాలింపు

ఒంగోలు క్రైం,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): పోలీసుల అదుపులో ఉన్న ఓ దొంగ చాకచక్యంగా పరారయ్యాడు. అదే సమయంలో ఆటో నగర్‌లో ఐదు దుకాణాల తాళాలు పగుల కొట్టి సుమారు రెండు లక్షల విలువైయిన సొత్తును అపహరించుకెళ్లాడు. సందట్లో సడేమియా అన్నట్లుగా పోలీసులంతా సీఎం బందోబస్తులో ఉంటే సీసీఎస్ పోలీసు స్టేషన్ నుంచి దొంగ పరారవడం కలకలం రేగుతోంది. ఒంగోలు నగరంలో దుకాణాల తలుపు తాళాలు పగుల కొట్టి చోరీలకు పాల్పడే దొంగను ఇటీవల సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. అయితే రికవరీ సొత్తు విషయంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం సీసీఎస్ పోలీసుల కళ్లు కప్పి దొంగ పరారయ్యాడు.

ఆటో నగర్‌లో చోరీలు

సీసీఎస్ పోలీసుల అదుపులో నుంచి తప్పించుకున్న దొంగ ఆటోనగర్‌లో ఐదు దుకాణాలలో చోరీలకు పాల్పడి సుమారు రెండు లక్షల విలువైన సొత్తును అపహరించుకెళ్లాడు. పోలీసుల అదుపులో నుంచి దొంగ ఒంగోలు వదిలి వెళ్లకుండా రాత్రి వరకు మకాం వేసి ఆటో నగర్‌లో తాళం వేసి ఉన్న ఎలక్ట్రికల్ దుకాణం షట్టర్ తాళం పగులకొట్టి ఇరువై వేలనగదు , సుమారు లక్ష రూపాయల విలువైన సొత్తును అపహరించుకెళ్లాడు. అదే విధంగా మరో ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో ఉన్నకేబులు వైరు సుమారు 25 కిలోలు చోరీ చేశాడు. ఇలా మరో మూడు దుకాణాల షట్టర్లు పగుల కొట్టి చోరీకి పాల్పడ్డాడు. గత నెలలో కూడా ఆటోనగర్‌లో మూడు దుకాణాలలో చోరీలకు పాల్పడ్డాడు.

సీసీ టీవీ పుటేజీని పరిశీలించిన పోలీసులు

ఆటోనగర్‌లో దొంగతనాలు జరిగిన ప్రాతంలో సీసీ పుటేజీ పరిశీలించిన పోలీసులు విస్తు పోయే నిజాలు తెలిసాయి. పోలీసుల అదుపులో నుంచి తప్పించుకున్న దొంగ ఐదు దుకాణాలలో చోరీలకు పాల్పడినట్లు పుటేజీ రావడంతో తలలు పట్టుకున్నారు. పరారీ అయిన దొంగ చోరీలకు పాల్పడటం పోలీసులకు సవాల్‌గా మారింది.


ఆటోనగర్‌లోని రెండు దుకాణాల తాళాలు పగులకొట్టి నగదు,వస్తువులు చోరీ చేసిన నిందితుడు

ఆందోళనలో ఆటోనగర్ వ్యాపారులు

ఆటోనగర్‌లో వరుసగా దొంగతనాలు జరగడంతో వ్యాపారులు వాపోతున్నారు. తమ దుకాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. ఆటో నగర్‌లో పోలీసు గస్తీ పెంచి తమ దుకాణాలను దొంగల బారినుంచి రక్షణ కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

గస్తీ పెంచుతాం - సీఐ విజయకృష్ణ

ఆటోనగర్‌లో రాత్రులు పోలీసు గస్తీ పెంచి దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ తెలిపారు. సీసీ పుటేజీ ఆధారంగా దొంగ సమాచారం సేకరించామని తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. ఎర్రగొండపాలెంలోని శివాలయం ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం మార్కాపురం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ ఈ రెండు నియోజకవర్గాలలో అగ్రిగోల్డ్ డైరెక్టర్ల పేర్ల మీద వేలాది ఎకరాల రిజిస్టర్ అయిన భూములు ఉన్నాయన్నారు. అవ్వా వెంకటరామారావు చైర్మన్ సోదరులు 8 రాష్ట్రాల్లో 32 లక్షల మందిని ముంచారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్, అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి తిరుమల రావు, యూనియన్ నాయకులు రామయ్య, సీపీఐ నాయకులు అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు

సీనియర్ మహిళా క్రికెట్ జట్టు ఎంపికకు విశేష స్పందన

ఒంగోలు, కార్పొరేషన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ (పీడీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా సీనియర్ మహిళా క్రికెట్ జట్టు ఎంపికకు విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక మంగమూరు రోడ్‌లోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మినీలార్డ్ ఎంపిక పోటీలు నిర్వహించగా అండర్ 23, సీనియర్ క్రికెటర్లు పాల్గొని ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పీడీసీఏ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళ క్రికెట్‌కు 20 మందిని ఎంపిక చేశామని తెలిపారు.

ఎంపికైన వారికి ఈనెల 9,10 తేదీలలో బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం, రావినూతలలోని క్రికెట్ స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించి బ్యాటింగ్, బౌలింగ్, కీపింగ్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిలో 16 మందితో ఫైనల్ జట్టు ఎంపిక చేస్తామని తెలిపారు.

అనంతరం ఈనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా మూలపాడులో జరిగే అంతర్ జిల్లాల మహిళ క్రికెట్ పోటీలలో జట్టు పాల్గొంటుందని వివరించారు. కాగా ఎంపిక పోటీలను పీడీసీఏ అధ్యక్షుడు నవీన్ కుమార్, జాయింట్ సెక్రటరీ బచ్చు శ్రీనివాసరావు, కోశాధికారి హనుమంతరావు, సభ్యులు బలరాం, కోచ్‌లు కొప్పోలు సుధాకర్, లెఫ్ట్ శ్రీను, చంద్ర, మహిళ కోచ్ దమయంతి తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.


ఎంపికైన ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్టు

1100 డయల్ ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన 1100 నెంబరుకు డయల్ చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో కోరారు. కాల్‌సెంటర్ ద్వారా వచ్చిన సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత అధికారికి ఆ సమస్యను పంపి పరిష్కరించడం జరుగుతుందన్నారు.

అర్జీదారుడి మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా నిర్ధారణ సందేశాన్ని కూడా పంపిస్తారన్నారు. అర్జీదారుడు అర్జీ స్థితితో పాటు సమాచారాన్ని కూడా ఈ కాల్‌సెంటర్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్సారియా కోరారు.

గ్రానైట్ క్వారీల్లో ప్రమాద ఘంటికలు

బల్లికురవ ఘటనతో మైన్స్ అధికారుల అప్రమత్తం
విస్తృత తనిఖీలకు రంగం సిద్ధం

చీమకుర్తి,ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఏడాదికొకసారి మొక్కుబడిగా జరిగే భద్రతా వారోత్సవాలు క్వారీల్లో ప్రమాదాలను నివారించలేకపోతున్నాయి.ఆదివారం బాపట్ల జిల్లా బల్లికురవ పరిధిలో ఉన్న ఓ గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు కార్మికులు మృత్యువాతకు గురికావటం క్వారీల్లో భద్రత డొల్ల అని మరోసారి నిరూపితం అయింది. కొండ దిగువన ఉన్న క్వారీల్లో నిబంధనలకు విరుద్ధంగా క్వారీయింగ్ చేస్తే ఎంత ప్రమాదమో బల్లికురవ ఘటన తేటతెల్లం చేస్తుంది. ఇదే తరహాలో చీమకుర్తి మండలం బూదవాడ పరిధిలోని ఎర్రకొండ దిగువలో ఉన్న క్వారీల్లో కూడా ప్రమాదం పొంచిఉంది. అంతేగాక రామతీర్థం పరిధిలో ఉన్న పలు క్వారీల్లో కూడా ఉండటం గమనార్హం. దశాబ్దం క్రితం హంసా గ్రానైట్ క్వారీలో బల్లికురవ తరహా సంఘటన జరిగి దాదాపు 14మంది కార్మికులు అసువులు బాసారు.ఈ పరిస్థితుల్లో ఇదే తరహా ప్రమాదాలు చోటుచేసుకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తమయ్యారు. మైనింగ్,మైన్స్‌సేఫ్టీ అధికారులు సంయుక్తంగా గెలాక్సీ గ్రానైట్ క్వారీలను పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నారు.


బూదవాడ పరిధిలో ఎర్రకొండపై ప్రమాదకరంగా ఉన్న క్వారీలు

ఆదాయమే పరమావధి

క్వారీ కార్యకలాపాల్లో చోటుచేసుకుంటున్న నిర్లిప్తత,ఆదాయమే పరమావధిగా కార్మికుల ప్రయోజనాలను కాలరాస్తూ యాజమాన్యాలు అనుసరిస్తున్న వైఖరితో గ్రానైట్ క్వారీల్లో మరణమృదంగం మోగుతోంది. క్వారీల్లో ఏడాదికాలంగా పలు ప్రమాదాలు చోటుచేసుకొని కార్మికులు మృత్యువాతకు గురవుతూనే ఉన్నారు.గెలాక్సీ గ్రానైట్ గనుల్లో అనునిత్యం నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకుంటునే ఉన్నాయి. యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరితోనే గనుల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. క్వారీల్లో ప్రమాదాలు చోటుచేసుకుండా చూడాల్సిన ప్రధాన బాధ్యత మైన్స్ మేనేజర్లపై ఉంటుంది.కానీ వీరి చేతులు కట్టేసి విధులు నిర్వర్తించమనేలా యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరితో మైన్స్ మేనేజర్లు ప్రమాదాలు జరుగుతున్నా చేష్టలుడిగి చూస్తుండిపోతున్నారు.


రామతీర్థం సమీపంలో అస్తవ్యస్తంగా తవ్విన క్వారీ

నేడు గిద్దలూరుకు తెలుగు తమ్ముళ్లు

రాచర్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మార్కెట్ యార్డ్‌లో నేడు జరిగే ప్రమాణ స్వీకారానికి తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లనున్నారు. టీడీపీ మండల యువనాయకుడు అంబవరం శ్రీనివాసరెడ్డి శ్రేణులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం


పోలేరమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు
ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల రోడ్డులో వెలసిన పోలేరమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణ నిర్వహించారు. అనంతరం మహిళలు ఊరేగింపుగా బోనాలు తెచ్చి సమర్పించారు. దళిత సహస్ర పారాయణం అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. కోలాటాలు, భజనలు, తీన్‌మార్ తప్పెట్లు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ రాత్రి అమ్మవారికి నగరోత్సవం నిర్వహించారు. పోలేరమ్మ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వమించారు.

మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

యువకుడికి గాయాలు

పొదిలి ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలోని మాదిరెడ్డిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం జరిగింది. పొదిలి మండలం నలకనూతల గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన బండి ఏసయ్య అనే యువకుడు మోటార్ సైకిల్‌పై వస్తూ అదుపుతప్పి మాదిరెడ్డిపాలెం వద్ద మైలురాయికి ఢీకొనగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది ఏసయ్యను పొదిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మార్కాపురం రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయవరం గ్రామంలో వనమాల బ్రహ్మయ్య వంటి పై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దొనకొండ మండలం మల్లంపేట గ్రామానికి చెందిన వనమాల మార్కాపురం మండలం రాయవరం గ్రామానికి చెన్నమ్మతో వివాహం అయింది. తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండంతో చెన్నమ్మ తన పుట్టిల్లు రాయవరానికి వచ్చింది. వనమాల బ్రహ్మయ్య భార్య పుట్టింట్లో ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు వెంటనే స్థానిక జిల్లా వైద్యశాలకు తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ మృతి

పొదిలి ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బొలేరో వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం టైలర్స్ కాలనీ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు .. మృతి చెందిన వ్యక్తి చీమకుర్తి మండలం, లక్ష్మీపురం రాజుపాలెంకు చెందిన సుబ్బారావుగా గుర్తించారు. పెద్దచెరువు సాగర్ పైపులైన్ నిర్మాణ పనుల్లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. అయితే మల్లవరం సమీపంలో జరుగుతున్న పనులను ముగించుకొని సుబ్బారావు స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా టైలర్స్ కాలనీ వద్ద ప్రమాదం జరిగింది. అదే సమయంలో ఒంగోలు నుంచి కనిగిరి వైపు వెళ్తున్న బొలేరో వాహనం వేగంగా సుబ్బారావు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు చెప్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించడం పలువురిని కంట తడిపెట్టించింది.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

ఎర్రగొండపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, రామయ్య, క్రిష్ణగౌడ్, శ్రీనివాసరావు, గుర్నాథం, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రజాక్షేత్రంలోకి రావాలి

చంద్రశేఖర్ ఆరోపణలను ఖండించిన టీడీపీ నేతలు


మాట్లాడుతున్న నాయకులు

పెద్ద దోర్నాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడో ఉంటావో.. ఎప్పుడు వ స్తారో తెలియని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రభుత్వంపైనా, టీడీపీ ఇన్‌చార్జిపైనా ఆరోపణలు చేయడం సరికాదని టీడీపీ నాయకులు హితవు పలికారు. ప్రజా సమస్యలపై ప్రజాక్షేత్రంలోకి చర్చకు రావాలని టీడీపీ మండల నాయకులు సవాల్ విసిరారు. మండల సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్ రెడ్డి అధ్యక్షతన బట్టు విద్యా సంస్థల కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే చంద్రశేఖర్ వ్యాఖ్యలను నేతలు ఖండించారు. బట్టు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలు కంటికి కనపడలేదా... కేవలం ఉనికి కోసం మాట్లాడే మాటలు మానుకొని హుందాగా వ్యవహరించాలన్నారు. ఒంగోలు పార్లమెంటు మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ మాబు మాట్లాడుతూ నవరత్నాలు పేరుతో నవ మోసాలు చేసింది వైసీపీ పాలకులు కాదా అన్నారు. సూపర్‌సిక్స్ పథకాల ను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదని అ న్నారు. నాలుగేళ్లుగా ఎరిక్షన్‌బాబు నియోజకవర్గంలోనే ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధి పనులు చేయిస్తూ ప్రజలకు సుపరిచితులయ్యారన్నారు. మీరు ఎక్కడో ఉండి మాట్లాడడం సరికాదన్నారు. ఉద్యోగం ఊడకుండా దొంగతనంగా సంతకాలు చేసి జాగ్రత్త పడే మీరు ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా పద్ధతులు మార్చుకొని ప్రజల కోసం పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెచ్చా హరగోపాల్, దొడ్డా శేషాద్రి, చంటి, సుబ్బారెడ్డి, దేసు నాగేంద్రబాబు, సుబ్బారావు,షేక్ మౌలాలి, వలి పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాలలో రాణించాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంగమేశ్వరరావు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని హైకోర్టు న్యాయవాది కమ్యూనిస్టు నాయకుడు కోటా సంగమేశ్వరరావు అన్నారు. నెహ్రూ బజారులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పి.అనిత రాసిన అభయ ది డెస్టినీ ఆఫ్ యూనివర్స్ అనే పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సంగమేశ్వరరావు మాట్లాడుతూ.. అభయ అనే పదం ధైర్యానికి, నమ్మకానికి ప్రతీక అన్నారు. కేవలం ఒక వ్యక్తి సొంతానికి మాత్రమే పరిమితం కాక ఇతరులకు కూడా ధైర్యాన్ని, నమ్మకాన్ని ఇచ్చేటువంటి పదం అన్నారు. మహిళలు పురోగమనపూర్వక రచనలు చేయడం అవసరం అని అలా ముందుకు వచ్చిన డా. అనితకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పుస్తక రచయిత అనిత, అధ్యాపకులు కుమార్ పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం అందజేత

ఎర్రగొండపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న సన్నెపోగు జార్జి భార్య కిడ్నీ వ్యాధికి గురై డయాలసిస్ కోసం అవసరమైన ఆర్థిక సాయాన్ని స్నేహితులు అందజేశారు. జార్జి స్నేహితులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. తమ కష్టాన్ని గుర్తించి ఆర్థిక సాయం చేసిన మిత్రులకు జార్జి కృతజ్ఞతలు తెలిపారు.



బాప్టిస్టు టౌన్ చర్చి కోశాధికారి రామస్వామి మృతి


రామస్వామి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్ తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి కమిటీ కోశాధికారి సీ రామస్వామి ఆదివారం మృతి చెందారు. తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో పలు పదవులు నిర్వహించారు. రామస్వామి మృతదేహాన్ని పలువురు క్రిస్టియన్ నాయకులు, పుర ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. సోమవారం ఉదయం 10గంటలకు ఏబీఎం కాంపౌండ్‌లోని క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో రామస్వామి భూస్థాపన కార్యక్రమం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

కూల్‌డ్రింక్ షాపులో మద్యం సీసాలు

త్రిపురాంతకం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కూల్ డ్రింక్ షాపులో మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 10 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అందిన సమాచారం మేరకు మండలంలోని రామసముద్రం గ్రామంలోని షాపులో మద్యం అమ్ముతున్న వై.పాలంక వీరయ్యను అదుపులోకి తీసుకుని బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు.

మానవత్వం చాటుకున్న యోగా గురూజీ

గిద్దలూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మద్యానికి అలవాటు పడి ఏ పని చేయకుండా ఉన్న గలిబిలి ప్రసాద్ కుటుంబానికి దూరమయ్యాడు. తల్లిదండ్రులు మృతి చెందగా ఇతని భార్యపిల్లలు కూడా ఇతని ప్రవర్తన నచ్చక వెళ్లిపోయారు. దాంతో కొన్నాళ్లుగా రోడ్లే ఇతనికి దిక్కయ్యాయి. గ్రంథాలయం ఎదుట నడువలేని పరిస్థితిలో రోడ్డుపైనే పడిపోయాడు. ఆకలి అని అరిచేందుకు కూడా శక్తి కోల్పోయాడు. దాంతో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి స్పందించి ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ నారాయణరెడ్డికి సమాచారం అందించారు. నారాయణరెడ్డి స్పందించి మున్సిపల్ కార్మికులు, ఇతర స్థానికుల సహకారంతో ప్రసాద్‌కు స్నానం చేయించి నూతన వస్త్రాలు తొడిగి కడప జిల్లా కాశినాయన మండలం ఓబులాపురం గ్రామంలోని వివేకానంద సేవా ఆశ్రమంలో చేర్చారు. నారాయణరెడ్డిని పలువురు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాగి తీగ చోరీ

ఎర్రగొండపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోళ్లవీడపి గ్రామ పొలాల్లో వ్యవసాయ బోరు వద్ద అలవాల బ్రహ్మారెడ్డి, పోలేబోయిన పెద్దన్న రైతులకు చెందిన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగ చోరీకి గురైన ఘటన శనివారం రాత్రి జరిగింది. బాధిత రైతులు పొలం వద్దకు వెళ్లగా బోరు వద్ద ట్రాన్సుఫార్మర్ పగులగొట్టి ఉంది. అందులోని రాగి తీగను అపహరించుకుపోయారని రైతులు విద్యుత్ ఏఈకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఏఈ అల్లూరయ్య ఎర్రగొండపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రెండు రోజుల కిందట ఇదే గ్రామ పొలాల్లో మరో రైతు పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి తీగను దొంగిలించారని ఏఈ అల్లూరయ్య తెలిపారు.



అక్రమ నిర్మాణమని రుజువు చేస్తే రాజీనామా చేస్తారా!



- ఎమ్మెల్యే బూచేపల్లికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి సవాల్
- 45 సంవత్సరాలుగా నిస్వార్థ సేవలందిస్తున్న గొట్టిపాటి కుటుంబం
- ఆస్తులు పోగొట్టుకున్నామేగాని, కోట్లు సంపాదించుకోలేదు!


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పువీరాయపాలెంలో పడగొట్టిన కాంప్లెక్స్ అన్యాయమని తేలితే రాజకీయాల నుంచి తాను శాశ్వతంగా తప్పుకుంటానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. అది ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించినట్లు రుజువైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా అని డాక్టర్ శివప్రసాద్‌రెడ్డికి సవాల్ విసిరారు. ఆదివారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాము అన్యాయంగా షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చేశామని ఫేక్ వీడియో ద్వారా ప్రచారం చేయటం శోచనీయమన్నారు. ఈవిషయంపై నిజాలు నిగ్గు తేల్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. గొట్టిపాటి కుటుంబం 45 సంవత్సరాలుగా ప్రజలకు నిస్వార్థ సేవలందిస్తుందని చెప్పారు. తాము రాజకీయాల్లో ఆస్తులు పోగొట్టుకున్నామే గాని కోట్లు సంపాదించుకోలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి అక్రమ వ్యాపారాల ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించుకున్నారని ఆమె ఆరోపించారు. దర్శి పట్టణంలోని ఏబీఎం మిషనరీ ఆస్తులను కొనుగోలు చేసి అక్రమ వ్యాపారాలు చేశారని ఆరోపించారు. అక్రమ మైనింగ్ ద్వారా కోట్లాది రూపాయలు కొల్లగొట్టారని విమర్శించారు. జడ్పీ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

సీఎం చంద్రబాబు రైతుల ముఖాముఖి సభ సూపర్ సక్సెస్ కావటంతో ఏంచేయాలో దిక్కుతోచక అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని డాక్టర్ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చని పొలాల మధ్య మండుటెండలో సీఎం చంద్రబాబు రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకంను అమలుచేస్తూ రైతుల ఖాతాల్లో నగదు జమ చేయటం జరిగిందన్నారు. రైతుల పొలాల్లో వేలాదిమంది సమక్షంలో ఆహ్లాదభరితంగా కార్యక్రమం జరిగితే వారికి సినిమా సెట్టింగులా కనిపించటం దారుణమన్నారు. రైతుల కోసం ఏరోజైనా మీరు కాని, మీ నాయకుడు కాని ఎండలో ఒక్క గంట అయినా పనిచేశారా అని ప్రశ్నించారు. ప్యాలెస్‌లో సెట్టింగులు వేసుకొని కార్యక్రమాలు నిర్వహించిన వైసీపీ అధినాయకుడి కింద పనిచేసే నాయకులకు రైతుల పొలాల్లో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం సినిమా సెట్టింగు లాగానే కనిపిస్తాయని ఎద్దేవా చేశారు.

దర్శి నియోజకవర్గంలో గత 20 సంవత్సరాలుగా ఉన్నామని చెబుతున్న ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డాక్టర్ లక్ష్మి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో నిలిచిపోయిన టీటీడీ కల్యాణ మండపం పునర్నిర్మాణం చేస్తున్నట్టు చెప్పారు. ముగిలిగుండాల రిజర్వాయర్ దాదాపు పూర్తికావచ్చిందని అన్నారు. కొద్దిరోజుల్లో జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. గత ఎన్నికల్లో లిక్కర్ స్కామ్‌లో దోచుకున్న డబ్బు ద్వారానే ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచారని చెప్పారు. ఆ కేసులో ఎంపీగా పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్న విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేస్తుండటంతో వైసీపీ నాయకులకు ఏంచేయాలో దిక్కుతోచక విలవిలలాడు తున్నారని ఆమె విమర్శించారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, అధికారులకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని తూర్పువీరాయపాలెంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించి రైతుల సమక్షంలో ఖాతాల్లో సొమ్ము జమచేయటంతో అక్కడ ఉన్న అన్నదాతలందరూ ఆనందించారని తెలిపారు. విలేకరుల సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, దర్శి, తాళ్ళూరు, ముండ్లమూరు మండలాల అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, కె.శ్రీనివాసరావు, దర్శి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కె.వెలిగొండారెడ్డి, తెలుగుమహిళా నాయకురాలు ఎం.శోభారాణి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కేసులు నమోదు

కనిగిరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు విక్రయించే హోల్‌సేల్, రిటైల్ షాపులను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి, మానవ మనుగడకు ప్రాణాంతకంగా మారిన ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలను నిషేధించినట్లు తెలిపారు. పట్టణంలోని కొట్లబజారు, ఎమ్మెస్సార్ రోడ్డు, తీగెలగొంది తదితర ప్రధాన రోడ్లులోని షాపులను తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న ఓ షాపు యజమానికి రూ.పదివేలు జరిమానా విధించారు. కమిషనర్ వెంట మున్సిపల్ సిబ్బంది రమణారెడ్డి, నాగలక్ష్మి, నాగజ్యోతి, బాషా తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో జారిపడి మహిళకు గాయాలు

కనిగిరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు దిగుతూ డ్రైనేజీ కాలువలో పడి మహిళకు గాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం రాత్రి పట్టణంలోని కొత్తూరు వద్ద చోటుచేసుకుంది. కొత్తూరులో నివాసం ఉంటున్న మహిళ తన బంధువులు ఉంటున్న బల్లిపల్లి గ్రామానికి వెళ్ళి తిరిగివస్తున్నారు. కొత్తూరు వద్ద బస్సు దిగేక్రమంలో భారీవర్షం కురుస్తుండటంతో డ్రైనేజి కాలువ తెలియక అందులో కాలిపెట్టి పడిపోయింది. డ్రైనేజిలో వర్షం నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొంత దూరం కొట్టుకుపోయింది. గమనించిన స్థానికులు మహిళను డ్రైనేజీ కాలువలో నుంచి బయటకు తీశారు. డ్రైనేజిలో కొట్టుకుపోవటంతో మహిళ కుడిచేయి విరిగింది. సమాచారం తెలుసుకున్న బంధువులు సంఘటనాస్థలికి చేరుకుని ఆసుపత్రికి తరలించారు.



బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తాం!

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఉగ్రనరసింహారెడ్డి

పామూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడి తనవంతు సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లోగల క్యాంపు కార్యాలయంలో ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లుతో కలిసి భజంత్రీల ఇనాం భూముల్లో నివాసం ఉంటున్న పలువురు బాధితులు డాక్టర్ ఉగ్రను కలిశారు. పామూరు పట్టణంలోని విరువూరు రోడ్డు పక్కన సుమారు 20 సంవత్సరాల క్రితం మాన్యంలో వేసిన స్థలాలను కొను గోలు చేసుకొని పలువురు పేద బడుగు బలహీన వర్గా లకు చెందిన వారు నివాసం ఉంటున్నట్టు ఎమ్మెల్యేకు చెప్పారు. ప్రభుత్వ పరంగా ఇళ్ల స్థలాలు వచ్చేటట్లు కృషి చేయా లని కోరారు. ఉగ్ర మాట్లా డుతూ సబంధిత అధికా రులతో మాట్లాడి న్యాయం చేసేందుకు ప్రయ త్నిస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, సయ్యద్ అమీర్‌బాబు, జి.శ్రీనివాసులు, వై.ప్రసాదరెడ్డి, షేక్ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.





పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక

దొనకొండ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి జీవితంలో చిన్నతనంలో జరిగిన తీపి జ్ఞాపకాలు గుర్తుంటాయి. చదువుకునే రోజుల్లో చేసిన అల్లరి, స్నేహితలుతో కలిసి ఆడిన ఆటలు ఒక మధురమైన క్షణాలు. దాదాపు 19 సంవత్సరాల క్రిందట వారంతా కలిసి ఒకే పాఠశాలలో చదువుకున్నారు. అనంతరం ఎక్కడెక్కడో ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో స్థిరపడ్డారు. మళ్లీ ఆసంఘటనలను గుర్తు చేసుకుంటూ సోమవారం తిరిగి అదే పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక మధుర జ్ఞాపకాలతో దొనకొండ ఆర్సీఎం ఎయిడెడ్ పాఠశాల ఆవరణ వేదికగా నిలిచింది. ఆర్సీఎం ఎయిడెడ్ పాఠశాలలో 2006-07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గెట్ టూ గెదర్ కార్యక్రమంలో దాదాపు 80 మంది హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ, చదువుకున్న రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా నాడు విద్యాబుద్ధులు నేర్పిన వై.అంతోనిదాస్, టి.మార్తమ్మ, కె.విల్సన్, వరికూటి వెంకటేశ్వర్లు, ఎం.క్లమెంట్, కటారు వెంకటేశ్వర్లు, మహబూబ్ బాషా, లిల్లీ సుచరితాదేవి, ఎం.అన్నమ్మను ఘనంగా సన్మానించారు.

ఉద్యమాలతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు వృత్తి పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కంచుకోవడానికి ఉద్యమాలు త ప్ప మరో మార్గంలేదని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక వడ్డుపాలెం స్కూల్‌లో జరిగిన సీఎస్‌పురం మండలశాఖ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల శాఖ ఎన్నికలను ఎన్నికల అధికారి పి. రాజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. అధ్యక్షుడిగా తోట శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా టి.లక్ష్మీనారాయణ, ఏ.సాయికుమార్, డి.పున్నమ్మ, ప్రధానకార్యదర్శిగా ఆనంద్‌బాబు, తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంఈవోలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

ముండ్లమూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు ఏపీ మోడల్ స్కూల్ వద్ద ద్విచక్ర వాహనంపైనుంచి జారిపడి తీవ్రగాయాలైన అద్దంకికి చెందిన కర్నాటి ఆదినారాయణమ్మ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. గతనెల 31వ తేదీ కర్నాటి వెంకటరెడ్డి, భార్య ఆదినారాయణమ్మ ద్విచక్ర వాహనంపై దర్శి మండలం చలివేంద్రం గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగిన నిశ్చితార్థానికి వెళ్ళి తిరిగి రాత్రికి అద్దంకి వస్తున్నారు. ఈక్రమంలో ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్ దగ్గర స్పీడు బ్రేకర్లు గమనించక ప్రమాదానికి గురయ్యారు. తీవ్రగాయాలైన ఆదినారాయణమ్మను వెంటనే ఒంగోలులోని కిమ్స్‌కు తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మృతి చెందారు. భర్త వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకుఏఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఏఎస్ఐ తెలిపారు.



కబళించిన క్వారీ

- వలస కూలీల ఉసురు తీసిన గ్రానైట్
- వర్షానికి మట్టి కరిగి పడిన రాయి.. ఆరుగురి సమాధి.. 10 మందికి గాయాలు
- మృతులందరూ ఒడిస్సా వాసులే..


ప్రమాదం జరిగిన గ్రానైట్ క్వారీ

క్వారీలో కోత పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో గ్రానైట్ రాయి కూలీల ఉసురుతీసింది. పొట్టకూటి కోసం ఒడిస్సా నుంచి వచ్చిన కూలీల బతుకులను క్వారీ కబళించేసింది. బల్లికురవ మండలం కొణిదెన రెవెన్యూ పరిధిలోని ఈర్లకొండ వద్ద ఉన్న సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో ఒడిస్సాకు చెందిన 16 మంది కూలీలు ఆదివారం పని చేస్తున్నారు. అయితే శనివారం కురిసిన వర్షానికి క్వారీ ఎగువ భాగం ఉన్న రాయి కింద మట్టి కరిగి పోయింది. అయితే దీనిని గమనించిన కూలీలు పనులు చేస్తుండగా ఆ గ్రానైట్ రాయి వారిపై పడింది. దీంతో నలుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా, నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు కూలీలు మృతి చెందారు.

స్నేహితుల దినోత్సవం రోజున విషాదం

భాస్కర్ భిష్ణోయ్, టకున దలాయ్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఒడిస్సా నుంచి క్వారీలో పనికి కూడా ఇద్దరు కలిసే వచ్చారు. కలిసి వచ్చిన స్నేహితులు స్నేహితుల దినోత్సవం రోజు కలిసి మృతి చెందడంతో స్థానికంగా విషాదం అలుముకుంది.

బల్లికురవ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సాలోని గంజాం జిల్లా చస్సనిమ్మకాడి గ్రామానికి చెందిన దండ బడత్య(48), కసాయ్ గ్రామానికి చెందిన సంతోష్‌గౌడ(36), దుగాన్ గ్రామానికి చెందిన ముస్సాజన(43), గజపతి జిల్లా చాందిపుట్ గ్రామానికి చెందిన టుకున దలాయ్(37), పసిగూడ గ్రామానికి చెందిన బనమల చెహ్రా(30), చాందిపుట్ గ్రామానికి చెందిన భాస్కర్ బిష్ణోయ్(40)లు మృతి చెందారు. గాయపడిన సుదర్శన్, అలోక్‌నాయక్, శిరాగౌడ, మహేంద్ర చెహ్రా, వెంకయ్య, సుభాష్‌మాలిక్, పవిత్ర బెహ్రా, దంబాలతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. వీరిలో ఆలోక్ నాయక్, శివగౌడ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. క్వారీ ప్రమాదంపై మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూలీల కుటుంబాలను ఆదుకుంటామన్నారు.

సీఎం ఆదేశాలతో కదిలిన అధికారులు

క్వారీలో ప్రమాదం జరిగిన (మిగతా 6లో)


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ


నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో చంద్రశేఖరనాయుడు


స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్న వారి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసు


ప్రత్యేక అలంకరణలో బగళాముఖి అమ్మవారు

బగళాముఖికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా శ్రీబగళాముఖి అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చిన ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులను అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని పోతనకట్టవారిపాలెం పంచాయతీ పుచ్చకుర్తివారిపాలెం, యేమినేనివారిపాలెం గ్రామాలకు చెందిన మహిళా భక్తులు, గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేకంగా పసుపుకుంకుమలు సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి, పోతనకట్టవారిపాలెం సర్పంచ్ యేమినేని పార్వతి, వై.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు

సూర్యలంకలో సందడి

బాపట్ల, బాపట్ల రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆదివారం బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో పర్యాటకుల సందడి నెలకొంది. హైదరాబాద్, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు సూర్యలంక తీరానికి ఉదయాన్నే చేరుకుని స్నానాలను ఆచరించారు. యువకులు కేరింతలు కొడుతూ, చిన్నారులు ఇసుక తెన్నెల్లో ఆడుకుంటూ సరదాగా గడిపారు. పర్యాటకులు కుటుంబ సభ్యులతో సమీప జీడిమామిడి తోటల కింద భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. భారీగా పర్యాటకులు రావడంతో మెరైన్, రూరల్ పోలీసులు గస్తీ నిర్వహించారు.

పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి విజయమ్మ

రేపల్లె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఎస్ విజయమ్మ పేర్కొన్నారు. ఆదివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా రేపల్లెలోని పట్టణ ఆరోగ్య కేంద్రం ఉప్పడి రోడ్డు వైద్యశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సు కు హాజరైన విజయమ్మ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహి స్తున్నట్టు చెప్పారు. బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. తల్లిపాల వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సముద్రాల రమేష్, షేక్ షాహిన్, షేక్ నతిక్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడిసి మోపెడు

- కాల్వల్లో నీళ్లున్నా సాగు సంకటం
- ఆయిల్ ఇంజన్లతో పంటలకు నీటితడులు

కొల్లూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాల్వల్లో నీళ్లున్నా పంట పొలాలకు అందని పరిస్థితి. జలాశయాల్లో పుష్కలంగా నీరున్నా సాగు నీటి కోసం అదనంగా భారం మోయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వరుణిడి కినుకతో కాల్వలకు విడుదలవుతోన్న నీటిపై ఆధారపడి కొల్లూరు మండలంలోని రైతులు వెద పద్ధతిలో సాగుకు శ్రీకారం చుట్టారు. ఇటీవల వాయుగుండం ప్రభావంతో ఓ మోస్తరు వర్షాలు కురిసినా ఆ తర్వాత విపరీతమైన ఎండలతో సాగు భూముల్లోని తడి ఆవిరై పంట పొలాలన్నీ బీటలు వారాయి. సీజన్ ప్రారంభం నుంచే వెదపైరుకు నీటి తడుల కోసం రైతులు విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లపై ఆధారపడ్డారు. తదనంతరం కాల్వలకు సాగునీరు విడుదల చేశారు. అయితే సరిపడ నీటి పరిమాణం కాల్వల్లో లేకపోవడంతో రైతులు ఆయిల్ ఇంజన్లు, ట్యూబుల సహాయంతో పైరుకు నీటి తడులు అందించుకోవాల్సి వచ్చింది. ఆయిల్ ఇంజన్ల ద్వారా అందిస్తున్న తడులు కొద్ది గంటల్లోనే గాలులకు ఆవిరైపోతున్నాయి. దీంతో పొలాల్లో నీరు లేక నెర్రెలిస్తున్నాయి. దీని వల్ల రైతులపై ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి తడుల కోసం అదనపు వ్యయభారం పడుతోంది. ఈ పరిణామాలతో ఈ ఏడాది సాగు వ్యయం పెరిగిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు కాల్వల వెంబడి తిరిగి నీటి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.


నీళ్లు అందక నెర్రెలిచ్చిన వరి పొలం


పంట కాల్వల్లో నీటిని ఆయిల్ ఇంజన్, ట్యూబుల సాయంతో నీటి తడులు అందిస్తున్న దృశ్యం

6 రోజులు.. 106 టీఎంసీలు



- సాగర్ నుంచి ఇప్పటి వరకు నీటి విడుదల
- జలాశయానికి తగ్గిన వరద..
- డ్యాం గేట్లు మూత జలశోయగాలను వీక్షించేందుకు వచ్చిన పర్యాటకుల నిరాశ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పరవళ్లు తొక్కుతూ ప్రవహించిన కృష్ణమ్మ శాంతించింది. శ్రీశైలం నుంచి నీటి విడుదల ఆగడంతో దిగువకు ప్రవాహం తగ్గింది. ఆదివారం నాగార్జున సాగర్ జలాశయానికి వరద ప్రవాహం తగ్గడంతో డ్యాం క్రస్ట్ గేట్లను మూసివేశారు. అయితే సాగర్ జలాశయం నుంచి గత కొన్ని రోజులుగా నీటి విడుదల చేస్తుండటంతో జల శోయగాలను వీక్షించేందుకు సెలవు రోజైన ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. అయితే డ్యాం గేట్లు మూసేయడంతో వారంతా నిరుత్సాహానికి లోనయ్యారు. గత నెల 29న డ్యాం క్రస్ట్ గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. జూలై నెలలో 18 ఏళ్లలో నీటి విడుదల చేయడం ఇదే ప్రథమం కావడంతో పలువురు విశేషంగా వ్యాఖ్యానించారు. ఆరు రోజులు సాగర్ జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. మొత్తం 106 టీఎంసీల నీరు డ్యాం నుంచి పులిచింతలకు విడుదల చేసినట్లు జలవనరులశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి.

ఇన్‌ఫ్లో 47,714 క్యూసెక్కులు..

ఆదివారం సాగర్ జలాశయంలోకి 47,714 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 28,988, జవహర్ కుడి కాల్వకు 8,604, ఎడమ కాల్వకు 8,022 మొత్తంగా 47,714 క్యూసెక్కుల నీటిని ఆదివారం డ్యాం నుంచి విడుదల చేశారు. నీటి మట్టం 590 అడుగులకు 585.8 అడుగులు ఉంది. పూర్తి సామర్థ్యం 312.05 టీఎంసీలకు 299.74 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

పులిచింతల నుంచి ఆగిన ప్రవాహం

పులిచింతల జలాశయానికి ఆదివారం నీటి ప్రవాహం తగ్గింది. దీంతో డ్యాం గేట్లు బంద్ చేసి నీటి విడుదలను నిలిపివేశారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 18,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. 21,131 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వస్తుండగా అదేస్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. జలాశయంలో 175 అడుగులకు 172.63 అడుగుల నీటి మట్టం ఉంది. పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలకు 42.18 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

రూ.9 వేల కోట్లతో రైల్వే, హైవే ప్రాజెక్టులు

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రైల్వే, హైవే ప్రాజెక్టులకు రూ.9 వేల కోట్లు మంజూరైనట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో చేసిన ప్రతిపాదనల మేరకు రాజధాని అమరావతి నుంచి ఎన్‌హెచ్ 16, ఎస్‌హెచ్ 216 కలుపుతూ నిజాంపట్నం హార్బర్ వరకు నాలుగు వరుసలరోడ్డు నిర్మాణానికి రూ.1600 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. జిల్లా మీదగా వెళ్లే 216 జాతీయ రహదారిని నాలుగు వరుసల్లో అభివృద్ధికి రూ.2,200 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. జీబీసీ రోడ్డును హైవేరోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరామన్నారు. రైల్వేకు సంబంధించి వేమూరు నియోజకవర్గ పరిధిలో ఐదు ఆర్వోబీల నిర్మాణానికి రూ.317 కోట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లాలో మరో ఐదు ఆర్వోబీలకు ప్రతిపాదనలు రూపొందించామన్నారు. మూడు లేన్లలో ఉన్న రైల్వే మార్గాన్ని నాలుగు లేన్లకు విస్తరించాలని ప్రతిపాదించగా రైల్వేమంత్రి అంగీకరించారన్నారు. రేపల్లె నుంచి తెనాలికి రెండో లేన్ నిర్మాణం రూ.1400 కోట్లతో త్వరలో కార్యరూపం దాల్చనుందన్నారు. బాపట్ల, చీరాల స్టేషన్లలో పలు రైళ్ల నిలుపుదలకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. టూరిజం, ఆక్వా, హ్యాండ్‌లూమ్ ప్రాజెక్ట్‌లకు సంబంధించి కేంద్ర మంత్రులకు వివరాలు అందజేశామన్నారు.

కాటాతో.. కనికట్టు

హుక్ కాటాలతో రేషన్ పంపిణీ పక్కదారి

- బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తోన్న డీలర్లు
- గతంలో ఎండీయూల వద్ద ఉన్న కాటాల వినియోగం



బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో పౌరసరఫరాల శాఖ ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు అమలు చేస్తోన్నా అందుకు విరుగుడుని కొంతమంది డీలర్లు ఇట్టే కనుగొంటున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు సరుకులు డోర్ డెలివరీ చేసేందుకు ఈ-పోస్ పరికరం, బ్లూటూత్ ఎలక్ట్రానిక్ కాటా కనెక్టివిటీని తొలుత తొలగించారు. ఇదే అదునుగా చాలామంది డీలర్లు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు ఈ-పోస్ పరికరంతో వెళ్లి వేలిముద్రలు వేయించి బియ్యానికి బదులుగా కేజీకి రూ.13 నుంచి రూ.14 చొప్పున లెక్క కట్టి చేతిలో పెట్టి ఆ బియ్యాన్ని మాఫియాకు చేరవేసి లబ్ధి పొందారు. ఈ నేపథ్యంలో బ్లూ టూత్ కనెక్టివిటీని పౌరసరఫరాల శాఖ ఈ నెల ఒకటో తేదీ నుంచి తిరిగి అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం డీలర్లు డోర్ డెలివరి చేయడానికి వెళ్లినప్పుడు ఈ-పోస్ డివైస్, బ్లూ టూత్ సదుపాయం కలిగిన ఎలక్ట్రానిక్ కాటా, సరుకులు తీసుకువెళ్లాలి. అయితే ఇంటింటికి ఎలక్ట్రానిక్ కాటాని తీసుకెళ్లడం సాధ్యపడే వ్యవహారం కాదు. ఈ నేపథ్యంలో గతంలో ఎండీయూల వద్ద ఉన్న బ్లూటూత్ సదుపాయం కలిగిన ఎలక్ట్రానిక్ కాటా హుక్(చాలా తేలికగా ఉంటుంది)ని తీసుకెళ్లి వేలిముద్రలు వేయించి బియ్యానికి బదులు నగదు ఇచ్చి లబ్ధి పొందుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి కాస్త కట్టుదిట్టం చేయడంతో దాని ప్రభావం రేషన్ పంపిణీపై పడింది. ఇతర జిల్లాల్లో 40 నుంచి 50 శాతం పైగా పంపిణీ ఇప్పటికే పూర్తి కాగా గుంటూరు జిల్లాలో ఉన్న 972 రేషన్ దుకాణాల్లో శనివారం సాయంత్రం వరకు లక్షా 63 వేల 380 మందికి(27.71 శాతం)మాత్రమే రేషన్ సరుకులు సరఫరా చేయగలిగారు. ఇందులోనూ (మిగతా 6లో)

గత నెలలో ఇష్టారాజ్యం..

గత నెలలో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా డిపో పరిధిలో ఐదు నుంచి 10 శాతం మించి పోర్టబిలిటీ కార్డులకు రేషన్ సరుకులు ఇవ్వరాదు. అయితే జూలైలో కొన్ని షాపుల పరిధిలో 60 శాతం పోర్టబిలిటీ కార్డులకు రేషన్ ఇచ్చారు. దీని వల్ల కొంతమంది డీలర్ల వద్ద సరుకుల నిల్వ అసలు తగ్గలేదు. కొందరి షాపుల్లో సరుకులు అయిపోయాయి. ఇలా జరగ డానికి ప్రధాన కారణం పోర్టబిలిటీపై ఆంక్షలు లేకపోవ డమే. అలానే 65 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులు, దివ్యాం గులకు ప్రతీ నెల రేషన్ సరుకులు ముందు నెల 26వ తేదీ నుంచే పంపిణీ చేస్తున్నారు. ఆ నాలుగైదు రోజులు ఈ-పోస్ డివైస్‌తో బ్లూ టూత్ ఎలక్ట్రానిక్ కాటా లింకుని తొలగిస్తున్నారు. ఇదే అదునుగా ఆ నాలుగు రోజుల్లోనే ఎక్కువ కార్డులను ఈ-పోస్‌లో కొట్టేస్తున్నారు.

చీరాల టౌన్ సర్వేయర్ సీటుపై గందరగోళం

- మూడు విభిన్న తరహాలో అధికారుల నుంచి ఉత్తర్వులు
- బాలాంజనేయులు పట్టు.. ససేమిరా అంటున్న ప్రజాప్రతినిధులు

చీరాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చీరాల టౌన్ సర్వేయర్ సీటుపై కొంతకాలంగా వివాదం నెలకొంది. ఆ స్థానంలో బాలాంజనేయులు, గోపీచంద్‌లలో ఎవరు కొనసాగాలనే అంశంలో కమిషనరేట్ రెండు నెలల క్రితం ఒక ఆర్డరు, తాజాగా వారిద్దర్నీ సస్పెండ్ చేస్తూ మరోరకమైన ఆదేశాలు ఇచ్చింది. అయితే అదే రోజు ఉదయం జిల్లా ఏడీ కనకప్రసాదరావు మరో ఆర్డర్ పాస్ చేయడంతో గందరగోళం నెలకొంది. గతంలో ఇక్కడ బాలాంజనేయులు టౌన్ సర్వేయర్‌గా విధులు నిర్వహించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆ స్థానంలో గోపీచంద్ సాధారణ బదిలీల్లో భాగంగా విధుల్లో చేరారు. ఇదిలా ఉంటే తిరిగి ఇక్కడే చేరాలని బాలాంజనేయులు జూన్‌లో చీరాల కమిషనర్ ప్రభాకరరెడ్డి నుంచి ఆర్డర్ పొందారు. గోపీచంద్‌ను జిల్లా సర్వే కార్యాలయానికి మారుస్తూ ఆర్డర్ ఇచ్చారు. కొంతకాలం గోపీచంద్ తాత్సారం చేయగా పలు ఆరోపణల నేపథ్యంలో బాలాంజనేయులపై కొందరు కౌన్సిలర్‌లు విముఖత చూపారు. దీంతో ఎమ్మెల్యే కూడా సిఫారసు లెటర్‌ను వెనక్కు కోరినట్లు సమాచారం. ఈ క్రమంలో గత నెల 31న బాలాంజనేయులును డిప్యుటేషన్‌లో జె పంగులూరు తహసీల్దార్ కార్యాలయానికి, గోపీచంద్‌ను చీరాలకు పంపుతూ ఏడీ ఆదేశాలిచ్చారు. ఈ ప్రకారం వారు ఆయా స్థానాల్లో చేరేందుకు సిద్ధమవుతుండగా రాష్ట్ర స్థాయి అధికారి వారిని సస్పెన్షన్ చేస్తూ అదే రోజు సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇద్దరు విధుల్లో చేరడంపై అధికారులు విచారణ చేపట్టారు. దాదాపుగా చీరాల్లో గోపీచంద్ కొనసాగనున్నట్లు దాదాపుగా ఖాయమైందని చెప్పవచ్చు. ఎమ్మెల్యే సిఫార్సు లేఖ వెనక్కి తీసుకున్నా బాలాంజనేయులు అధికారులకు మాత్రం ఎమ్మెల్యే లెటర్‌కు సంబంధించి కలర్ జిరాక్స్ అందించి ఆర్డర్ తెచ్చుకున్నట్లు పుకార్లు వస్తున్నాయి.

అవీ.. ఇవీ..

కారు ఢీకొని మోటార్‌సైకిలిస్టుకు తీవ్రగాయాలు

అద్దంకి, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): నామ్ రోడ్డులో మలుపు తిరుగుతున్న మోటార్‌సైకిలిస్టును కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు ప్రకాశం జిల్లా దర్శి మండలం చినఉయ్యాలవాడకు చెందిన గాలం కోటేశ్వరరావు ఆదివారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై అద్దంకి మండలం శాంతినగర్ వద్ద నామ్ రోడ్డులో యూ టర్న్ తీసుకుంటుండగా కావలి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన కోటేశ్వరరావును స్థానికులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

వ్యాసరచన పోటీ

అద్దంకిటౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో యం.త్రిమూర్తులు సౌజన్యంతో విద్యార్థులు, పౌరులకు 'జీవనది గుండ్లకమ్మ పరిరక్షణ' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్నట్లు సంస్థల ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో ఎక్కడి నుంచైనా పాల్గొన వచ్చని, వ్యాసరచన రాసిన పేపర్లను ఈ నెల 6వ తేదీ సాయంత్రంలోపు పాత ఎల్ఐసి ఆఫీస్ ఎదురు దుకాణంలో అందజేయాలన్నారు. వ్యాసరచన రెండు, మూడు పేజీలకు మించకూడదని,, విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, అలాగే పౌరులకు మూడు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 7న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9848749979, 9182688106 నంబర్లను సంప్రదించాలన్నారు.

తరంగగానానికి జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు శ్రీకృష్ణ సంపత్‌కుమార్



సంపత్‌కుమార్‌కు కళాపురస్కారాన్ని అందజేస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తరంగగానంలో అపూర్వమైన ప్రతిభను ప్రదర్శిస్తున్న కవి శ్రీకృష్ణ సంపత్‌కుమార్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక పుట్టంరాజు కళాక్షేత్రంలో కవి శ్రీకృష్ణ సంపత్‌కుమార్‌కు పుట్టంరాజు బుల్లెయ్య- రామలక్ష్మమ్మల విస్తృత కళాపురస్కారం అందజేశారు. పద్య కవి డీవీఎం సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులు కవి సంపత్‌కుమార్‌కు విస్తృత కళాపురస్కారాన్ని అందజేయగా సభ్యులందరు ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో కార్యదర్శి కేవీ.పోలిరెడ్డి, కోశాధికారి చుండూరి మురళీ సుధాకరరావు, వారణాసి రఘురామశర్మ, వెంకట శివరామప్రసాదు, ఎన్‌వీఎల్ హనుమంతరావు, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, యువీ.రత్నం, దేవపాలన, దివాకర్‌దత్తు, రాజశేఖర్ తదితరులు పాలొన్నారు.

ఎలుకల మందు తిన్న యువతి మృతి

• ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం

అద్దంకి, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి సహజీవనం చేస్తున్న యువకుడు పెళ్లికి నిరాకరించాడని యువతి ఎలుకల మందు తిని చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అద్దంకి పట్టణంలో చోటుచేసుకొంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలేనికి చెందిన కీర్తిపాటి రమ్య(22) అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులోని ఓ ఫిజియోథెరఫి సెంటర్‌లో పనిచేస్తోంది. పక్కనే ఓ ల్యాబ్‌లో పనిచేస్తున్న పి. ప్రవీణ్‌కుమార్‌లు ప్రేమించుకున్నారు. వీరు రామాటాకీస్ బజార్‌లో గది అద్దెకు తీసుకొని కలిసి ఉంటున్నారు. అయితే కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారని, పెళ్లి చేసుకునేందుకు ప్రవీణ్‌కుమార్ నిరాకరించాడు. దీంతో గత నెల 27న ఎలుకల మందు తిని, నిద్ర మాత్రలు మింగింది. విషయం తెలుసుకున్న రమ్య సోదరి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. అయితే చికిత్స పొందుతూ శనివారం రమ్య మృతి చెందింది. అక్కడ నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహ తెలిపారు.

6న సత్రం బడిలో ప్రత్యేక వైద్య శిబిరం

అద్దంకిటౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని సత్రంబడి ఆవరణంలోని ఈ నెల 6న బాపట్ల జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో అద్దంకి నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు ఉచిత ఉపకరణాల నిర్థారణ వైద్యశిబిరం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంఈవో అనంతు శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ క్యాంపునకు ఉత్తరప్రదేశ్ కాన్పూరుకు చెందిన అలెంకో సంస్థకు చెందిన వైద్యుల బృందం హాజరై వైద్య పరీక్షలు చేస్తుందన్నారు. నియోజవర్గంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్, ప్రైవేయిట్ పాఠశాలలలోని 18 సంవత్సరాలలోపు ఉన్న వివిధ రకాల వైకల్యాలు కలిగిన విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి, అవసరమైన ఉపకరణాలను అందజేస్తారన్నారు. ఈ క్యాంప్‌కు హాజరయ్యే విద్యార్థులు ఆధార్‌కార్డు, సదరన్ సర్టిఫికేట్, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని నియోజవర్గంలోని ఐదు మండలాల్లోని ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9849960723, 9100996459లను సంప్రదించాలన్నారు.

ఆదమరిస్తే అంతే..

• బొమ్మల కూడలిలో ప్రమాదకరమైన గుంత



బొమ్మలకూడలిలో ఏర్పడిన గుంతలో నిలిచిన నీరు

పర్చూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : నిత్యంరద్దీగా ఉండే పర్చూరు బొమ్మల కూడలిలో బీటీరోడ్డును కలుపుతూ ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డు మధ్య ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. గుంతను గుర్తించని ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికితోడు సమీపంలోని దుకాణదారులు తమ దుకాణాల ముందు ఇష్టారాజ్యంగా మెరకలు పోయడంతో వర్షపు నీరు గుంతలో చేరి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదకరంగా మారిన గుంతకు మరమ్మతులు చేయించడంతోపాటు, దుకాణాల ముందు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన మెరకను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేదరమెట్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మేదరమెట్ల బస్టాండ్ సెంటర్ వద్ద నుంచి గ్రామంలోకి వేళ్లే ప్రధాన వీదిలో డాక్టర్ పున్నయ్య హాస్పిటల్ వరకు సోమవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం సరఫర నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

భీమేశ్వరస్వామి ఆలయంలో తవ్వకాలు

గుప్తనిధుల కోసం రాత్రికి రాత్రే తవ్వకాలు



ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్విన ప్రాంతం

అద్దంకి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం భీమలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు మరోసారి తవ్వకాలు జరిపారు. సామాన్యశకం 8వ శతాబ్దానికి పూర్వం నాటి దేవాలయంగా భావిస్తున్న ధర్మవరం సమీపంలోని భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో గుప్త నిధుల కోసం ఇప్పటికే 10 సార్లుకుపైగా తవ్వకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. గత ఏడాది ఫిబ్రవరి నెలలో కూడా తవ్వకాలు జరిగాయి. ఆరేడు సంవత్సరాల క్రితం దేవాలయం లోపల శివలింగం ఉన్న ప్రాంతంలో కూడా తవ్వకాలు చేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టారు. దేవాలయం ముందు భాగంలోని నాపరాళ్లను తొలగించి తవ్వకాలు చేసినట్లు భావిస్తున్నారు. బయట పడ్డ బండ రాళ్లను సమీపంలో పడవేశారు. అనంతరం మరలా నాపరాళ్ళు యదావిధిగా పరిచి సిమెంట్ పూత పూసారు. ఆదివారం ఉదయం దేవాలయానికి వెళ్లిన భక్తులు తవ్వకాలు జరిగిన విషయాన్ని గమనించి దేవాదాయ శాఖ అధికారులకు తెలియజేశారు. అద్దంకి గ్రూపు దేవస్థానాల ఈవో శైలేంద్రకుమార్, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అతి పురాతన దేవాలయం కావడంతో గుప్త నిధులు ఉన్నాయన్న ఆలోచనతో తరచూ తవ్వకాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పంచపాండవులు ధర్మవరం సమీపంలో 5 శివలింగాలను ప్రతిష్టించి దేవాలయాల నిర్మాణం చేపట్టారు. భీముడు ప్రతిష్ఠించిన శివలింగం కావడంతో భీమ లింగేశ్వరస్వామి దేవాలయంగా పిలుస్తున్నారు. భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో శివలింగం నేలపైన మూడు అడుగుల ఎత్తు ఉండగా, భూమి లోపల మరో అడుగులు ఉన్నట్లు భక్తులు చెబుతున్నారు. భీమ లింగేశ్వరస్వామి దేవాలయం పునరుద్ధరణకు ప్రభుత్వం నుంచి త్వరలో సుమారు రూ.1.50 కోట నిధులు మంజూరుకు మంత్రి రవికుమార్ కృషి చేస్తున్నారు.

పేదల వైద్యుడి మృతి అత్యంత బాధాకరం

• ఎమ్మెల్యే కొండయ్య



డాక్టర్ సాల్మన్ పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

సాల్మన్‌సెంటర్(చీరాల), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రాంతంలో వేలమంది నిరుపేదలకు నాణ్యమైన వైద్యం నిర్విరామంగా అందించి, ప్రజాదరణ పొందిన వైద్యులు డా.రిచర్డ్‌సన్ సాల్మన్ అకాల మరణం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ అన్నారు. ఆదివారం డా.సాల్మన్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులుగా, సంఘ సంస్కర్తగా ప్రజల్లో గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచినట్లు పేర్కొన్నారు. తండ్రిబాటలోనే ప్రజాసేవకు జీవితం అర్పించినట్లు చెప్పారు. అలాగే ప్రభుత్వ భవనాలకు సొంత స్థలాలను బహుకరించినట్లు వివరించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. వారి వెంట టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిమ్మనపాలెం వద్ద అండర్‌పాస్ నిర్మించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్నకుమారి

మేదరమెట్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద అండర్‌పాస్ నిర్మించాలని మండల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ తీర్మానం కాపీని జాతీయ రహదారుల విభాగం పీడీకి పంపించాలని నిర్ణయించారు. ఆదివారం కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో .'ఆంధ్రజ్యోతి'లో రెండు రోజుల క్రితం 'పక్కవీధికి వెళ్లాలంటే 8 కిలోమీటర్లు తిరిగి వెళ్లాలి' అనే శీర్షికన ప్రచురితమైన కథనం చర్చకు వచ్చింది. సమావేశంలో తిమ్మనపాలెం గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను, అక్కడ 12 మీటర్ల వంతెన నిర్మించాల్సిన అవసరాన్ని గురించి మాట్లాడారు. వర్షాకాలం వస్తున్నందున గ్రామాలల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. కాలువలో ఎక్కడ నీరు నిల్వకుండా చర్యలు తీసుకో వాలన్నారు. దోమలు గుడ్లు పెట్టడానికి వీలు లేకుండా ఆయిల్ బాల్స్ వంటివి వేయాల న్నారు. అన్ని శాఖల అధికారులు ఆయా శాఖల నివేదికలను ప్రజాప్రతినిధులకు వివరించారు. సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టుమార్టం ఆలస్యం చేయడంపై ఆందోళన



అద్దంకి ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

అద్దంకి, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): పోస్టుమార్టం ఆలస్యం కావడంపై ఓ మృతురాలి బంధువులు ఆదివారం రాత్రి అద్దంకి ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆందోళన చేపట్టారు. వివరాలలోకి వెళితే మండలంలోని కొత్తరెడ్డిపాలేనికి చెందిన కర్ణ వెంకటరెడ్డి, ఆదినారాయణమ్మలు అద్దంకి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. గత నెల 31న దర్శిలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. ఈ దంపతులు తిరిగి తమ మోటార్‌సైకిల్‌పై వస్తూ ముండ్లమూరు సమీపంలో స్పీడు బ్రేకర్ వద్ద కిందపడ్డారు. దీంతో ఆదినారాయణమ్మకు తీ వ్ర గాయాలు అయ్యాయి. అనంతరం ఆమెకు అద్దంకి, ఒంగోలు, గుంటూరు వైద్యశాలలో చికిత్స అందించినా, శనివారం మృతి చెందింది. అయితే గుంటూరులో పోస్టుమార్టం నిర్వహించకుండానే అద్దంకి తీసుకువచ్చారు. ప్రమా దంపై ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై, ఉండటం, వైద్యశాల నుంచి సమాచారం రావడంతో ఆదివారం సాయంత్రం పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తీసుకువచ్చారు. అయితే చీకటిపడిందని పోస్టుమార్టం చేసేందుకు వైద్యులు నిరాకరించారు. దీంతో ఆదివారం రాత్రి బంధువులు ఆందోళన చేపట్టారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

పర్చూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ఎస్సై జి.వి.చౌదరి మందుబాబులను హెచ్చరించారు. పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామ శివారులోని నిరుపయోగంగా ఉన్న ఒకనాటి బాలుర వసతి గృహంలో మద్యం సేవిస్తున్న యువకులను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ నిర్వహించారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బొమ్మల కూడలిలో పలు ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పోలీసుల రంగప్రవేశంతో మందుబాబులు ఉరుకులు పరుగులు తీశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎక్కడైనా బహిరంగ ప్రదేశాలతోపాటు, బస్టాండ్‌లు తదితర ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్నట్లు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. నిబంధనలను అతిక్రమించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోక తప్పదన్నారు. యువత మాదకద్రవ్యాలకు లోనుకాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులతోపాటు, ప్రజలపై కూడా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

కాటాతో.. కనికట్టు

(5వ పేజీ తరువాయి)

పోర్టబిలిటీ కార్డులు 71165 ఉండటం గమనార్హం. పల్నాడు జిల్లాలో 1289 షాపుల పరిధిలో 2,83,265(44.61 శాతం) మందికి సరుకులు పంపిణీ చేశారు. ఈ జిల్లాలో పోర్టబిలిటీ ద్వారా సరుకులు తీసుకెళ్లిన కుటుంబాలు 1,02,410 ఉన్నాయి. బాపట్ల జిల్లాలో 1123 దుకాణాల పరిధిలో 1,78,359(37.46 శాతం) సరుకుల పంపిణీ జరగ్గా పోర్టబిలిటీ ద్వారా 49,836 మంది తీసుకున్నారు. ఈ నేపథ్యంలో డీలర్ల వద్ద ఉన్న ఎండీయూల ఎలక్ట్రానిక్ కాటాలు(హాక్ టైప్‌వి) స్వాధీనపరుచుకోవాలని వినియోగదారుల సంఘాల నాయకులు సూచిస్తున్నారు. అలానే డీలర్ పేరుతో లింక్ చేసిన ఎలక్ట్రానిక్ కాటా ద్వారానే సరుకుల పంపిణీ జరిగేలా చూడాలని, అలానే జియో కో-ఆర్డినేట్స్‌ని ఈ విషయంలో పరిగణనలోకి తీసుకునేలా నిబంధనలు మార్పు చేయాలని కోరుతున్నారు.

మద్యం తాగి బైకును తగులబెట్టారు..!

ఒంగోలు క్రైం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): పూటుగా మద్యం తాగిన స్నేహితులు తరువాత గొడవపడి మోటార్‌సైకిల్‌ను పెట్రోలు పోసి తగులబెట్టారు. ఈ ఘటన ఆదివారం ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్డులోని పాలకేంద్రం వద్ద చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రాజస్థాన్‌కు చెందిన లూనారాయ్, సాయి స్టోన్ ఆర్టిస్ట్‌లో గోవింద్ అనే మేస్త్రీ వద్ద పనిచేస్తున్నాడు. అదేవిధంగా చీమకుర్తి గ్రానైట్స్‌లలో రాజస్థాన్‌కు చెందిన అర్జున్, కిషోర్ పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం అర్జున్, కిషోర్ ఒంగోలు వస్తూ లూనారాయ్‌కి ఫోన్ చేసి మద్యం తాగుదామని చెప్పుకున్నారు. అయితే లునారాయ్ తన మేస్త్రీ గోవింద్ మోటార్ సైకిల్‌పై వ స్తుండగా పాలకేంద్రం వద్ద వరకు వచ్చే సరికి వాహనంలో పెట్రోల్ అయిపోయింది. ఈమేరకు కిషోర్, అర్జున్‌లకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పి వస్తూ పెట్రోలు తీసుకురమ్మని చెప్పాడు. దీంతో వారు ఓ బాటిల్‌లో పెట్రోలు తెచ్చి వాహనంలో పోయలేదు. మోటార్‌సైకిల్ కవర్‌లో పెట్టి ముగ్గురు చీమకుర్తి నుంచి తెచ్చిన మోటార్‌సైకిల్‌పై వెళ్ళి మద్యం తాగారు. అక్కడ గొడవపడ్డారు. దీంతో కవర్‌లో ఉన్న బాటిల్ బయ టకు తీసి వాహనంపై పెట్రోల్ పోసి తగులపెట్టి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

కబళించిన క్వారీ

(5వ పేజీ తరువాయి)



మృతదేహాలను పరిశీలిస్తున్న గంగాధర్‌గౌడ్

విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపట్టాలని, మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టర్ వెంకటమురళి, చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు నరసరావుపేటలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్న కూలీలను పరామర్శించారు. మృతులకు రూ. 14 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.10లక్షలు చొప్పున పరిహారాన్ని యాజమాన్యం నుంచి ఇప్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ తుషార్ డూడీ, మైనింగ్ డీడీ రాజశేఖరరావు, ఏడీ రామచంద్రరావు తదితరులు పరిశీలించారు. పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామ న్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుండి వివరాలు సేకరిస్తా మన్నారు. ఎస్పీ వెంట బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, సంతమాగులూరు సీఐ వెంకటరావు, బల్లికురవ ఎస్ఐ నాగరాజు, తహసీల్దార్ రవినాయక్, ఇన్‌చార్జి ఎంపీడీవో పాండు రంగస్వామి క్వారీ వద్ద సహాయక చర్యలు పర్యవేక్షించారు. ఉదయం 10 గంటల సమయంలో ప్రమాదం జరగగా, మధ్యాహ్నం ఒంటిగంట వరకు మీడియాను ప్రమాద స్థలి వద్దకు పోలీసులు అనుమతించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒడిసాకు మృతదేహాల తరలింపు

అద్దంకి, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో అక్కడిక్కడే మృతి చెందిన నలుగురి మృతదేహాలను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను ఒడిసా రాష్ట్రంలోని స్వగ్రామాలకు పంపించారు. జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్, డిఎంహెచ్‌వో విజయమ్మ, బాపట్ల డిఎస్‌పీ రామాంజనేయులు, అద్దంకి పట్టణ, మార్టూరు సీఐలు సుబ్బరాజు, శేషగిరిరావు తదిత రులు పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

చీరాల, ఆగస్టు 3 (ఆంధ్ర జ్యోతి) : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వలన భవిష్యత్తు తరాలు ఆనందంగా జీవిస్తాయని ఎమ్మెల్యే కొండయ్య, నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని నగరవనాన్ని వారు పరిశీలించారు. అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. అక్కడి జాతీయ రహదారి వెంబడి మొక్కలు నాటారు. కీర్తివారిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పోలేరమ్మ వారి కొలుపులలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోమేపల్లి కావ్యకు డాక్టరేట్



అవార్డు ప్రదానోత్సవంలో కావ్య

అద్దంకిటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అద్దంకికి చెందిన ఉపాధ్యాయుడు సోమేపల్లి హనుమంతరావు కుమార్తె సోమేపల్లి కావ్య అమెరికాలోని యూనివర్శిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. కావ్య అమెరికాలోని యుఎంకేసీ యూనివర్శిటీలో ఎం.ఎస్(సివిల్) పూర్తి చేశారు. అనంతరం అ మెరికాలో ఫిలడెల్ఫియాలోని టెంపుల్ యూనివర్శిటీలో 'మల్టీస్కేల్ ఎనాలిసిస్ ఆఫ్ సిక్స్ పీపీడీ -క్వినోనే' అనే అంశంపై పరిశోధన చేసి అతి తక్కువ కాలంలోనే ప్రొఫెసర్ డాక్టర్ అందలూరి గంగాధర్ పర్యవేక్షణలో పిహెచ్‌డి పూర్తి చేశారు. టెంపుల్ యూనివర్శిటి ఛైర్మన్, ప్రొఫెసర్ డాక్టర్ ఫిలిప్ ఉడోయిస్ యాంగ్, ప్రొఫెసర్ డాక్టర్ ఇచున్‌ఝూ, ప్రొఫెసర్ డాక్టర్ మోహన్ ఆచారిలు అబ్జర్వర్‌లుగా వ్యవహరించి సోమేపల్లి కావ్యకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

పేద విద్యార్థికి పూర్వవిద్యార్థుల ఆర్థికసాయం

వేటపాలెం(చీరాల), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : దాతలు అందించిన తోడ్పాటుతో విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని పలువురు అన్నారు. మండల పరిధిలోని బండ్ల బాపయ్య కళాశాలలో ఇంటర్‌లో సయ్యద్ సుభాని 983 మార్కులతో ఉత్తమంగా రాణించాడు. దీంతో అతనికి ఆ కళాశాల పూర్వ విద్యార్థులు ఎంఎస్ బేగ్, బండ్ల బాబు, దేవర గంగాధర్‌రావులు కలిసి రూ.13 వేలు ఆర్థిక సాయం అందజేశారు. విద్యాదశలో చదువుకు ఆర్థిక సమస్యలు ఉండకూడదని అన్నారు. కార్యక్రమంలో సయ్యద్ మొహిద్దీన్, సదాశివరావు, భార్గవరామ్, ఖాదర్, అజీజ్, సుభాని, రంగ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యసూత్రాలపై అవగాహన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీనివాసులు

చీరాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రేష్ఠమైన ఆహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించడం అందరికి ఆనందకరమని ప్రొఫెసర్ డా. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆరోగ్య సూత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరూ విధిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో యల్లమందరెడ్డి, కట్టా రాజ్ వినయ్‌కుమార్, రామారావు, మునీరుల్లా, నాగవీరభద్రాచారి, వెంకటేశ్వర్లు, శివాంజనేయ ప్రసాద్, కృష్ణమూర్తి, శర్మ, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రతివ్యక్తి ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలి

• గుండెవైద్య నిపుణుడు డాక్టర్ నాగకిరణ్



రోగికి గుండె పరీక్ష చేస్తున్న నాగకిరణ్

పంగులూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గుండె ఆరోగ్య విషయంలో ప్రతివ్యక్తి తగిన జాగ్రత్తలు పాటించాలని విజయవాడ హెల్త్ హాస్పటల్స్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ నాగకిరణ్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పంగులూరులో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో పంగులూరు పరిసర గ్రామాలకు చెందిన 60 మందికి గుండె పరీక్షలు నిర్వహించి 12 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. ఈ వైద్యశిబిరంలో క్లబ్ కార్యదర్శి విశ్రాంత సైంటిస్ట్ రాయిణి రామారావు, పీఆర్‌వో సతీష్, క్లబ్ ప్రతినిదులు పెంట్యాల జగదీశ్వరరావు, కరణం హనుమంతరావు, షేక్ కాలేషావలి, గుర్రం ఆంజనే యులు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మోటార్ సైకిలిస్టు మృతి



ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్సై షేక్ రఫీ

మేదరమెట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అనమనమూరు నుంచి మేదరమెట్ల వస్తున్న ట్రాక్టర్ మోటర్ సైకిల్‌ను ఢీ కొన్న ఘటనలో మోటర్ సైకిలిస్ట్ ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అనమనమూరుకు చెందిన పైయేద్దు ఏడుకొండలు(32) మేదరమెట్ల నుంచి స్కూటీపై అనమనమూరు వస్తుండగా మణికేశ్వరం నుంచి ఇసుకతో వస్తున్న ట్రాక్టర్ మలుపు వద్ద స్కూటీని ఢీ కొనడంతో స్కూటీతో సహా ఏడుకొండలు రోడ్డు అంచులో పడిపోయాడు. ఇసుక ట్రాలీ రోడ్డు మార్జిన్‌లో పడిన ఏడుకొండ లుపై బోల్తా పడింది. దీంతో ఏడుకొండలు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండు రోజుల క్రితం మేదరమెట్ల లో ప్రైవేట్ బస్సు ఢీ ఘటనలో ఏడుకొండలు మేనమామ సాంబశివరావు మృతిచెందాడు. ఒకే కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు

చీరాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని టూటౌన్ సీఐ నాగభూషణం పేర్కొన్నారు. ఆదివారం స్టేషన్ పరిధిలో ఓపెన్ డ్రంక్‌పై దాడులు చేశారు. ఈ సందర్భంగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం చీరాల రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకొంది. మృతుడు గులాబీ రంగు, నలుపు రంగు గీతల చొక్కా, నలుపు రంగు లోయర్ ధరించి ఉన్నాడు. చొక్కాకు బాంబే స్టయిల్స్ టీఎస్ఎల్ అని ఉంది. ఘటనపై రైల్వే ఎస్సై కొండయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ చార్జీల నిలువు దోపిడీని ఆపాలి

పర్చూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల నిలువు దోపిడిని ఆపాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య అన్నారు. ఆదివారం విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లు రద్దు తదితర అంశాలకు వ్యతిరేకంగా ఈనెల 5న సీపీఎం పార్టీ అధ్వర్యంలో తలపెట్టిన బందును సంబంధించిన కరపత్రాలను పర్చూరులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల బిల్లులు మందుగానే వస్తున్నాయన్నారు. బిల్లులు చెల్లించలేక వినియోగ దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ప్రజలు, ప్రజా సంఘాలు పార్టీలకు అతీతంగా భారమైన కరంటు మీటర్లను వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



● నెల్లూరు రూరల్ మండలం వెల్లంటి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(పేరుమార్చాం)ది నిరుపేద కుటుంబం. కుటుంబ అవసరాలు, వైద్యం ఖర్చుల కోసం ఓ మైక్రో ఫైనాన్స్ సంస్థ వద్ద ఇంటిని తనఖా పెట్టి అప్పు తీసుకున్నాడు. నెలనెలా ఈఎంఐ భారాన్ని మోయలేక రుణం తీర్చడం ఆలస్యమైంది. వెంటనే రంగంలోకి దిగిన ఆ సంస్థ ప్రతినిధులు ఇంటికి తాళం వేసి, గోడపై ఈ ఇల్లు తనఖాలో ఉందని రాసివెళ్లారు. దీంతో గ్రామస్థులకు ముఖం చూపించలేక వెంకటేశ్వర్లు కొన్నాళ్లుగా ఊరిబయటే ఉంటున్నాడు.

● అలాగే రూరల్ మండలం కొండ్లపూడి పంచాయతీ రాజగోపాలపురంలో మరో కుటుంబం కూడా మైక్రో ఫైనాన్స్ ఊబిలో చిక్కుకుంది. అధిక వడ్డీలతో రుణభారం ఎక్కువై.. ఇంటికి వచ్చి రుణసంస్థ ప్రతినిధులు వేసే దూషణలు, పెట్టే వేధింపులు తట్టుకోలేక ఆ కుటుంబం ఊరు వదిలి వెళ్లిపోయింది.

'మైక్రో నాగుల' బుసలు

● దళితవాడలే లక్ష్యంగా ఫైనాన్స్ వ్యాపారం

● అడిగినంత ఇస్తామని ఇళ్లూవాకిళ్ల తనఖా

● అధికవడ్డీలతో ఈఎంఐలు కట్టలేక బెంబేలు ● రెండేళ్లుగా పేట్రేగుతున్న రుణ సంస్థలు

నెల్లూరురూరల్, ఆగస్టు 3,(ఆంధ్రజ్యోతి): ఇలా... ఆ రెండు గ్రామాలే కాదు. నెల్లూరు రూరల్ మండలంలోని అన్నీ గ్రామాల దళితవాడల్లోని పరిస్థితి ఇది. గత రెండేళ్లగా అవసరాలకు రుణాలిస్తామని మైక్రో ఫైనాన్స్ సంస్థలు గ్రామాల్లో కాలనాగులై బుసలు కొడుతున్నాయి. హరిజనులు, గిరిజనుల అవసరాలను ఆసరాగా చేసుకుని, ముందుగా రుణం ఇచ్చి ఆ తరువాత ఇళ్లూవాకిళ్లు తనఖా పెట్టుకుంటున్నారు. ఈ వ్యవహారంలో కొంతమంది గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు కూడా పాలుపంచుకుంటున్నట్లు సమాచారం. వీరిచ్చే ధ్రువీకరణల వల్లే గ్రామ కంఠానికి చెందిన నివాసాలను రిజిస్ట్రేషన్ చేయించి, తనఖా పెట్టుకుని ఆపై రుణ సంస్థల వారు నగదును అప్పుగా ఇస్తున్నారు. అనంతరం రుణం చెల్లించాలంటూ నెలనెలా విధించే అధిక వడ్డీలతో కూడిన ఈఎంఐ (ఎవ్రీ మంత్ ఇన్‌స్టాల్ మెంట్)ను చెల్లించలేక పేదలు అవస్థలు పడుతున్నారు. రుణభారం మోయలేని కొన్ని కుటుంబాలు రుణ సంస్థల ప్రతినిధుల దూషణలు, వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడమో...లేక ఊరి వదిలివెళ్లిపోవడమో చేస్తున్నారు.

● రూ. 10 లక్షలకు రూ.9లక్షలే చేతికి..

రూ. 10 లక్షల రుణం కోసం రూ. 20 లక్షలు విలువ చేసే ఇంటిని తనఖా పెట్టుకుంటున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలు.. చివరికి రూ.10లక్షలకు రూ. 9 లక్షలే చేతికి ఇస్తున్నాయి. రూ. లక్ష ఇతర ఖర్చులంటూ వారి వద్దే ఉంచుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే రుణం పూర్తిగా ఇవ్వరు. గ్రామ కంఠాలకు చెందిన ఇళ్లకు పంచాయతీ కార్యదర్శి నుంచి ఎన్‌వోసీ పొంది. ఆపై వీఆర్వో ద్వారా సర్వే చేయించుకుని రిపోర్టు తీసుకుని, వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించుకునే క్రమంలో రూ. వేలు ఖర్చవుతున్నాయి. చివరి దశలో రుణ సంస్థల ప్రతినిధులు చెప్పింది వినకపోతే పెట్టిన ఖర్చంతా వృథా అవుతుందని, విధిలేక రుణం తీసుకుం టున్నామని బాధితులు పేర్కొన్నారు.



ఆర్‌బీఐ అనుమతులుంటేనే రుణాలివ్వాలి



ప్రజలు ఎవరిపడితే వాళ్లు ఫైనాన్స్ బిజినెస్ చేయకూడదు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా అనుమతులున్న సంస్థలు మాత్రమే ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలి. రుణాలిస్తామని ఎవరూ వచ్చినా అగ్రిమెంట్లను పూర్తిగా చదివి, లేదా తెలుసుకున్న తరువాతే సంతకాలు చేయండి. అంతా అయిపోయాక న్యాయం జరగదు. ఫైనాన్స్ సంస్థల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- గుంజి వేణు, నెల్లూరు రూరల్ సీఐ

బ్యాంకుల్లో కఠిన ఆంక్షల వల్లే..



పేదలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకుల్లో కఠినమైన ఆంక్షలు ఉన్నాయి. అందువల్లే వారంతా మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించాలి. పేదలకు, నిరుపేదలకు సులభంగా రుణాలు అందచేయాలి. అప్పుడే ప్రైవేట్ సంస్థల ఆగడాలు ఆగుతాయి.

- పూడిపర్తి జనార్దన్, సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి

వేధింపులతో దళితుడి బలవన్మరణం



మస్తానయ్య ఇల్లు తనఖాలో ఉన్నట్లు రాసిన హోమ్ ఫైనాన్స్ నిర్వాహకులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): అల్టమ్ క్రెడో హోం ఫైనాన్స్ సంస్థ వేధింపులు తట్టుకోలేక, నగర పంచాయతీ పరిధి కట్టుబడిపాళెం దళితవాడకు చెందిన జీ. చిన మస్తానయ్య (70) బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు, మస్తానయ్య తమ పిల్లల చదువుల కోసం అల్టమ్ క్రెడో హోం ఫైనాన్స్ వారికి ఇంటిని తనఖా పెట్టి రుణం తీసుకున్నాడు. రెండేళ్లపాటు రుణం చెల్లించాడు. పిల్లలు చదువులు పూర్తయి ఉద్యోగయత్నాల్లో ఉన్నారు. మిగతా రుణం పిల్లలకు ఉద్యోగం వచ్చిన వెంటనే చెల్లిస్తామని మస్తానయ్య, భార్య మంగమ్మ ఆ సంస్థ వారిని బతిమలాడారు. ఆయన వాళ్లు ససేమిరా అన్నారు. మస్తానయ్య ఇంటి గోడపైన 'ఈ ఇల్లు అల్టమ్‌క్రెడో హోం ఫైనాన్స్‌లో తనఖా ఉంచబడింది, ఈ ఇంటిని రూ. 8లక్షల కు అమ్మబడును' అని రాసి వెళ్లారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన మస్తానయ్య శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో దళితవాడలో విషాదం నెలకొంది. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● సూసైడ్ నోట్ రాసి...

ఫైనాన్స్ కంపెనీవారి ఒత్తిడి తట్టుకోలేకే తాను బలవన్మరణా నికి పాల్పడుతున్నట్లు చిన్న మస్తానయ్య ముందుగానే సూసైడ్ రాశాడు. అందులో 'తన చావుకు అల్టమ్ క్రెడో హోం ఫైనాన్స్ కంపెనీ మేనేజరే కారణం.. ఈ సూసైడ్ నోట్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలి. అలాగే డెత్ సర్టిఫికెట్‌ను కడప పీఎఫ్ ఆఫీసులో అందచేయండి. మీకు త్వరగా డబ్బులు వస్తాయి', అని రాసి ఉంది. ఆ నోటును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



మస్తానయ్య(ఫైల్)



నెల్లూరు నగరంలో నిర్వహించిన అవగాహన ప్రదర్శన

ప్రాణాలు కాపాడేశక్తి అవయవదానానికే ఉంది...

● ఓ వ్యక్తి దానం చేస్తే కొందరి జీవితాల్లో వెలుగు

● అవగాహన సదస్సులో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలను కాపాడేశక్తి అవయవదానానికే ఉందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం జాతీయ అవయవదానం దినోత్సవం సందర్భంగా నెల్లూరులో భారీ అవగాహన ప్రదర్శన నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు ఈ ప్రదర్శన సాగింది. ఈ కార్యక్రమంలో జీవన్‌దాన్ సంస్థతోపాటు అపోలో, మెడికవర్, కిమ్స్, నారాయణ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా కలెక్టర్ ఆనంద్ పాల్గొని మాట్లాడారు. అవయవదానంపై ప్రజలకు అవగాహన చాలా తక్కువగా ఉందన్నారు. ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపే ఈ గొప్ప కార్యక్రమంపై క్షేత్ర స్థాయిలో విస్తృత అవగాహన కలిగించాలన్నారు. దళారుల మాట నమ్మకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అవయవదానం చేయాలని జీవన్‌దాన్ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. అనంతరం అవయవ దానానికి ప్రోత్సహించిన వైద్యులను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నందన్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, అపోలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్, మెడికవర్ ఆసుపత్రి క్లస్టర్ హెడ్ రంజిత్‌రెడ్డి, కిమ్స్ ఆసుపత్రి సీఈవో డాక్టర్ సతీష్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, నారాయణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దొరసానమ్మ, నారాయణ ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నీటి విడుదలకు ముందు తెలుగుగంగ కాలువ వద్ద పూజలు చేస్తున్న అధికారులు

కండలేరుకు సోమశిల జలాల విడుదల

అనంతసాగరం ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నుంచి కండలేరుకు ఆదివారం అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణారెడ్డి, చైర్మన్ వేలూరు కేశవచౌదరి గంగమ్మకు పూజలు చేసి వాయినం వదిలారు. అనంతరం నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ప్రస్తుతం ఎగువ నుంచి కృష్ణాజలాలు వస్తున్నాయని, ఉన్నతాధికారుల ఆదేశాలతో కండలేరుకు 6,000ల క్యూసెక్కుల నీటిని ఇస్తున్నట్లు చెప్పారు. వరద మట్టం పెరిగితే నీటి విడుదల మోతాదు పెంచుతామని ఆయన తెలిపారు. కాగా సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 12,483 క్యూసెక్కుల ప్రవాహం వస్తుంది. దీంతో జలాశయ నీటిమట్టం 34.970 టీఎంసీలకు చేరుకుంది. ఉత్తరకాలువకు 370, డెల్టాకు 3,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● నీటి విడుదలపై హెచ్చరికలేవీ?

సోమశిల నుంచి దిగువకు నీరు వదిలే ప్రతిసారి ఇంజనీర్లు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నీటి విడుదలకు ముందు డెల్టా, నాన్‌డెల్టా పరిధిలోని ప్రజలను అప్రమత్తం చేయాలి. ముందుగానే పత్రికలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం కల్పిస్తే ప్రజలకు, మూగజీవాలకు ప్రమాదాలు జరుగకుండా చూడవచ్చు. అయితే అదిశగా ఇంజనీర్లు సమాచారం ఇవ్వడం లేదు. కేవలం సైరన్ మోగించి నీటిని విడుదలకు ఉపక్రమిస్తున్నారు. ఆసైరన్ శబ్దం కేవలం సోమశిలకు మాత్రమే పరిమితమవుతోంది.

రుణాలు ఎప్పుడిస్తారో..?

● సబ్సిడీ లోన్ల మంజూరుకు బ్రేకులు

● దరఖాస్తులు స్వీకరించాక అడ్డంకులు

● నాలుగు నెలలుగా ముందుకు పడని అడుగు

● నిర్ణయం ప్రకటించని ప్రభుత్వం ● నిరీక్షిస్తున్న వేలాదిమంది పేదలు

నెల్లూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఒకటికాదు... రెండు కాదు... ఏకంగా ఐదేళ్ల తర్వాత రాయితీ రుణాల మంజూరుకు ప్రకటన వెలువడడంతో పేదలంతా ఆనందపడ్డారు. వైసీపీ ప్రభుత్వం నిలిపేసిన సబ్సిడీ రుణాల పథకాన్ని తిరిగి కూటమి ప్రభుత్వం ప్రారంభించడంతో నిరుద్యోగుల్లోనూ ఆశలు చిగురించాయి. ఊహించిన దానికంటే అధికంగా దరఖాస్తులు కూడా వచ్చాయి. అయితే ఏమైందోకానీ ఈ ప్రక్రియను నిలిపేయాలని రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఇది జరిగి నాలుగు నెలలు గడిచింది. ఒకసారి ప్రభుత్వం నుంచి అనుమతి లభించి, దరఖాస్తులు కూడా స్వీకరించాక, ఎందుకు అడుగు ముందుకు పడలేదు..? అంటే ఎవరికీ స్పష్టత లేదు. తమకు రుణాలు ఎప్పుడు మంజూరవుతాయని దరఖాస్తుదారులు అడిగితే.. ఎవరూ చెప్పలేని పరిస్థితి.

● ఐదేళ్ల తర్వాత మంజూరు

సొంతకాళ్ల మీద నిలబడాలనుకునేవారికి రాయితీ రుణాలు ఎంతో ఉపయోగకరం. ఇందులో 40 నుంచి 60 శాతం వరకు సబ్సిడీ ఇస్తుండడంతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం రాకముందు ప్రతీ కుల కార్పొరేషన్ ద్వారా ప్రతీ ఏటా రాయితీ రుణాలు అందిస్తూ వచ్చారు. అయితే వైసీపీ పాలనలో మాత్రం ఒక్క రుణం కూడా మంజూరు చేయలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సబ్సిడీ రుణాల జాతర మొదలైంది. జిల్లాలో ఒక్క ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రభుత్వం 1240 యూనిట్లను మంజూరు చేసింది. ఇందుకు రూ.51.81 కోట్లతో అనుమతులు ఇచ్చింది. అందులో రూ.20.46 కోట్లను రాయితీ కింద అందిస్తుండగా, మరో రూ.28.75 కోట్లను బ్యాంకు రుణంగా సమకూర్చనున్నారు. మిగిలిన ఐదుశాతం అంటే రూ.2.59 కోట్లను లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. రూ.3 లక్షలలోపు రుణాలు 226 ఉండగా వీటికి 60 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. అలానే రూ.3 లక్షల నుంచి 10 లక్షల వరకూ ఉన్న యూనిట్లు 628 ఉండగా వీటికి 40 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. ఇవి గాక ఆటోలు, ట్రక్కులు, కార్లు, ఇతర వాహనాలు కూడా మంజూరు చేస్తుండగా వీటికి 50 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. అదే విధంగా బీసీ కార్పొరేషన్ కింద 1328 యూనిట్లు, మిగిలిన ఎనిమిది కార్పొరేషన్లకు కలిపి 801 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో కూడా 50 శాతం వరకు సబ్సిడీ రుణాలున్నాయి.

● భారీగా దరఖాస్తులు

బీసీ కార్పొరేషన్ అధికారులు 2024-25 సంవత్సరానికి రుణాలు మంజూరు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. 1328 యూనిట్ల కోసం ఏకంగా 14973 మంది దర ఖాస్తులు చేసుకున్నారు. అంటే సరాసరి ఒక యూనిట్ కోసం పదిమందికి పైగా పేదలు పోటీ పడ్డారు. అలానే రెడ్డి కార్పొరేషన్ కింద 161 యూనిట్లకు గానూ 545 మంది, కాపు కార్పొరేషన్ కింద 231 యూనిట్లకు 1830 మంది, వైశ్య కార్పొరేషన్ కింద 47 యూని ట్లకు 329 మంది, కమ్మ కార్పొరేషన్ కింద 115 యూని ట్లకు 411 మంది, ఈబీసీ కార్పొరేషన్ కింద 105 యూనిట్లకు 541 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్పొరేషన్ల పరిధిలోని యూని ట్లన్నింటికీ దరఖాస్తులను స్వీకరించి, అర్హులను కూడా ఎంపిక చేశారు. ఇక ఎస్సీ కార్పొరేషన్ కింద 1240 యూనిట్లకు సుమారు 12 వేల వరకు దరఖాస్తులు వచ్చినట్లు అంచనా. ఈ యూనిట్లకు దరఖాస్తుల స్వీక రణ సమయంలోనే బ్రేకులు పడ్డాయి. ఇక 2025-26 సంవత్సరానికిగానూ మైనారిటీ కార్పొరేషన్ కింద జిల్లాకు 1449 యూనిట్లు మంజూర య్యాయి. ప్రస్తుతం వీటికి దరఖాస్తుల స్వీకరణ సాగుతోంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన సబ్సిడీ యూనిట్లకు మంజూరు ప్రక్రియ నాలుగు నెల లుగా నిలిచిపోయింది. కొన్ని దర ఖాస్తులు ఎంపీడీవోల లాగిన్లలో , మరికొన్ని కలెక్టర్ లాగిన్ స్థాయిలో ఆగిపోయాయి. రాష్ట్ర ఉన్నతాధికా రుల నుంచి ఆదేశాలు వస్తేగానీ రుణాల ప్రక్రియ ముందుకు సాగ దు. దీంతో ఇంకెన్నాళ్లు వేచి చూడాలోనన్న ఆందోళన దరఖాస్తుదారుల్లో కనిపిస్తోంది. ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. వీటిలో చాలావరకు పరిశీలన కూడా చేశాం. వీటన్నింటిని ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో అక్కడి నుంచి ఉత్తర్వులు రానున్నాయి. ఆ ఉత్తర్వులకు అనుగుణంగా రుణాలు మంజూరు చేస్తాం.

- నిర్మలా దేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ

చీపురు పట్టిన బీసీ సంక్షేమాధికారి

ఒక్కరోజులో జిల్లాలోని వసతిగృహాలు శుభ్రం

రాష్ట్రాధికారుల ఆదేశాలతో కార్యక్రమం నిర్వహణ

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నతాధికారులు తలచుకుంటే ఏపనైనా చేయగలరని నిరూపించారు. జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ హాస్టళ్లు చెత్తాచెదారాలతో నిండి ఉండటాన్ని వారు గుర్తించారు. వెంటనే స్పందించారు. మెగా క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమాన్ని ప్రకటించారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ చీపురు పట్టి నగరంలోని భక్తవత్సల్ నగర్ బీసీ బాలికల హాస్టల్‌ను శుభ్రం చేశారు. హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు కూడా ఆమెతో జతకలిశారు. హాస్టల్ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు. ఆ హాస్టల్‌లోని అన్నీ గదులను, మరుగుదొడ్లను, వంటసామగ్రిని శుభ్రం చేయించారు. స్టోర్‌రూమ్‌లో నిత్యావసర సరుకులను ప్లాస్టిక్ డబ్బాల్లో భద్రపరిచేలా ఏర్పాటు చేశారు. ఆ డబ్బాలపై ఆయా సరుకుల వివరాలు తెలిపే లేబుళ్లను వేయించారు. అనంతరం విద్యార్థినులకు పరిశుభ్రత గురించి వివరించారు. విద్యార్థినులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని తెలిపారు. అలాగే హాస్టల్‌కు మంచి పేరు తీసుకుని రావాలని ఆమె కోరారు. 10వ తరగతి విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించి, వారు మంచి మార్కులు సాధించేలా చూడాలని హాస్టల్ వార్డెన్‌ను ఆదేశించారు. జిల్లా అధికారే స్వయంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొనడంతో జిల్లాలోని అన్నీ హాస్టళ్లలో వెల్ఫేర్ అధికారులు కూడా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



నగరంలోని భక్తవత్సలనగర్‌లో హాస్టల్ ప్రాంగణాన్ని శుభ్రంచేస్తున్న బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ

సిట్ కస్టడీకి కాకాణి

భూరికార్డుల తారుమారుపై విచారించిన అధికారులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆదివారం సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. వెంకటాచలం సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని కాకుటూరు పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను పట్టా భూములుగా రికార్డులు మార్చిన కేసులో ఆయన రిమాండ్‌లో ఉన్నారు. కోర్టు అనుమతితో సిట్ డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఉదయం కస్టడీలోకి తీసుకుని నెల్లూరు డీటీసీకి తరలించారు. ప్రభుత్వ భూములను పట్టాభూములుగా మార్చడంలో మీ ప్రమేయం ఉందికదా...? మీ ప్రోత్సాహంతోనే రికార్డులు మార్చారు.. అందుకు మా వద్ద సాక్ష్యాలు ఉన్నాయి.. ఇందుకు మీరేమంటారు...? అని సిట్ అధికారులు కాకాణిని ప్రశ్నించారు. అందుకు ఆయన 'నాకేమీ తెలియదు, సంబంధం లేదు' అని తెలిపినట్లు సమాచారం. ఇలా 25కిపైగా ప్రశ్నలు వేయగా, ఆయన ఏ ప్రశ్నకు సరైన సమాధానం చెప్పలేదని తెలిసింది. సోమవారం కూడా సిట్ పోలీసులు ఆయన్ను విచారించనున్నారు.

సమస్యల్లో టిడ్కో గృహాలు

వివరాలు 7లో

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 475

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9569
వెండి కిలో ధర	రూ. 114200
వెండి ఒక గ్రాము	రూ.117.20

వరకట్న నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

అల్లూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వరకట్న నిషేధిత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి సమాజంలో వరకట్నాన్ని తీసుకోవడం ఇవ్వడం చట్టరీత్యా నేరమని, ఈ చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం అలసత్వం వహించడం సరికాదని పేర్కొన్నారు. వివాహాన్ని వివాహ బంధాన్ని గౌరవించే తెలుగు రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్‌కు అంతరాయం

కందుకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓగూరు సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే గనికుంట ఫీడర్ 11 కేవీ విద్యుత్ లైన్‌కు ఇబ్బంది కలిగించే చెట్లు కొమ్మలు సోమవారం తొలగించే క్రమంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గనికుంట ఫీడర్ పరిధిలోని కల్వకూరివారిపాలెం, దివివారిపాలెం, గనికుంట వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు సహరించాలని కోరారు. మధ్యాహ్నం 1 గంట నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన తెలిపారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

బిట్రగుంట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బోగోలులోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్ అధ్యక్షతన ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కోశాధికారి సీవీసీ సత్యం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 11 ఏళ్ల ప్రధాని నరేంద్ర మోదీ పాలన అభివృద్ధి, సంక్షేమం పెద్దఎత్తున జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్ఎస్‌యాదవ్, మండల మహిళా అధ్యక్షురాలు నూకసాని రాజ్యలక్ష్మి, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బాలసుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కరపత్రాల పంపిణీ

లింగసముద్రం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని గ్రామంలో వైసీపీ మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరెడ్డి అధ్యక్షతన ఆదివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ షఫీ, నాయకులు రసూల్, షరీఫ్, రసూల్ హమీద్, ఫయాజ్, కమలాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి జాఫర్ పాల్గొన్నారు.

కోన నిత్యాన్నదాన పథకానికి రూ.50వేలు వితరణ

రాపూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పెంచలకోన శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రాపూరు పట్టణానికి చెందిన సిద్ధలయ్య సెంటర్‌లోని ప్రొవిజన్ షాపు యజమాని విచ్చన్నగిరి గురవయ్య, ఆదిలక్ష్మమ్మ దంపతులు ఆదివారం రూ.50వేలు విరాళం ఇచ్చారు. ఈ నగదును కోనలో ఆలయ సిబ్బందికి అందజేశారు. దేవస్థానం అధికారులు వారికి స్వామి, అమ్మవారు, ఆంజనేయస్వామి ఆలయాల్లో దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిర్లక్ష్యానికి కేరాఫ్ 'టిడ్కో'!

● సమస్యలు పట్టించుకునే వారేరీ? ● అవస్థలు పడుతున్న ప్రజలు



టిడ్కో గృహాలకు పైకి అల్లుకుంటున్న చెట్ల తీగలు

కావలి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న టిడ్కో గృహ సముదాయం పిచ్చి మొక్కలు, మురుగు నీటి నిల్వలతో అపరిశుభ్రతకు, నిర్లక్ష్యానికి కేరాఫ్‌గా మారింది. భయాందోళనల మధ్య నివాసం ఉంటున్న ప్రజల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అసలే చెరువు అంచున నిర్మించి ఉన్న ఆ గృహ సముదాయాలకు చుట్టూ ప్రహరీ లేక పాములు, తదితర విష పురుగులు బెడదతో భయపడుతున్నారు. దీనికి తోడు గృహాల సముదాయాలు చుట్టూ పిచ్చిమొక్కలు అడవిని తలపించేలా పెరుగుతున్నాయి. ఈ పిచ్చి మొక్కల తీగలు భవనం పై అంతస్థులకు పైకల్లా పాకుతూ పోతుండటంతోపై ఆ అంతస్థులలో నివాసాలు ఉండే వారికి కూడా పాములు, తదితర విష పురుగుల బెడద తప్పేట్లు లేదని ఆందోళన చెందుతున్నారు. అసలే అక్కడ సమస్యలతో సతమత మవుతుండగా ఇప్పుడు అదనంగా గృహాలు చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతూ అడవిలా తయారవుతుండటంతో ఇళ్లలో నుంచి బయటకు వస్తే ఎక్కడ విష పురుగుల కాటుకు గురవుతామని ప్రజలు భయపడుతున్నారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటూ స్వచ్ఛ సర్వేక్షణ బహుమతులు కూడా తీసుకుంటున్న మున్సిపల్ అధికారులకు టిడ్కో గృహ సముదాయంలో



గృహ సముదాల మధ్య అడవిలాపెరిగిన పిచ్చి మొక్కలు



టిడ్కో ఇళ్ల వద్ద నిల్వ చేరిన మురుగు

ఉన్న పారిశుధ్య సమస్య వారి కంట పడకపోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు అక్కడ గ్యాంగ్ వర్క్ పెట్టి అక్కడ ఉన్న పిచ్చి చెట్లను తొలగించాల్సి ఉంది. ఆ తర్వాత అక్కడ నివాసం ఉంటున్న వారితో సమావేశాలు నిర్వహించి ఎవరి ఇళ్ల ముందు వారు ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలు మొలవకుండా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని వారిలో చైతన్యం తీసుకు రావాల్సి ఉంది.

పాలిటెక్నిక్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

కందుకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ విభాగంలో ఆదివారం డిప్లొమా ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు స్నేహ పూర్వక స్వాగతం పలికేందుకు సీనియర్లు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల విజయశ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే అనేది విద్యార్థి జీవితంలో మర్చిపోలేని ఘట్టమని, ఇది కొత్త పరిచయాలకు వేదికగా నిలుస్తుందన్నారు. అంతేకాకుండా విద్యార్థులు చదువులో మెరుగుపడడమే కాకుండా తమ ప్రతిభను గుర్తించుకుని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునే అవకాశం రోజుగా ఉపయోగించుకోవాలన్నారు. చదువుతోపాటు ఆనందిస్తూ విజయం వైపు అడుగులు వేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ వేడుకల్లో పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ హరిబాబు, అన్ని విభాగా హెచ్‌వోడీలు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ పతనంలో ఉపాధ్యాయుల పోరాట పాత్ర కీలకం

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి(టౌన్), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పతనంలో ఉపాధ్యాయుల పోరాట పాత్ర కీలకమని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పెన్షనర్స్ భవనంలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు అధ్యక్షతన జరిగిన బహుజన టీచర్స్ అసోసియేషన్ 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులను ఇబ్బందులు పెట్టిన ఏ ప్రభుత్వం అయినా పతనం అవ్వాల్సిందేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తన కుమారుడు లోకేష్‌నే విద్యాశాఖ మంత్రిని చేశారన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ విద్యను, విద్యావిధానాలను నిర్వీర్యం చేశారని, హక్కుల కోసం గళమెత్తిన ఉపాధ్యాయులను అణచివెయ్యాలని నిర్బంధాలు పెట్టినా పెద్దఎత్తున ఉపాధ్యాయులు ఉద్యమించిన తీరు ఎన్నికల్లో కూటమి పార్టీ నేతలకు స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిట్టేడు రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్, కోశాధికారి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి మాసా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కావలిలో 142వ నేత్రదానం



అంజమ్మ(ఫైల్)

కావలి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సుంకర దయాకర్‌రెడ్డి తల్లి సుంకర అంజమ్మ(82) వృద్ధాప్యంతో మృతి చెందగా ఆమె చివరి కోరిక మేరకు ఆమె నేత్రాలను కావలి రెడ్‌క్రాస్ సహకారంతో దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ హస్పిటల్ టెక్నీషియన్ సునీల్ ఆమె కార్నియాలను ఆదివారం సేకరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, జిల్లా పాలకమండలి సభ్యుడు కలికి శ్రీహరిరెడ్డి, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ గాదిరెడ్డి హరనాథ్‌లు దయాకర్‌రెడ్డికి ప్రశంసా పత్రాన్ని అందచేశారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 142వ నేత్రదానమని తెలిపారు.

7వ వార్డులో 'సుపరిపాలనలో తొలి అడుగు'



సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ శ్రేణులు

కందుకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వంలో తొలి ఏడాది అందించిన సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధిపై ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గౌస్‌బాషా, రూబీ, ఖాదర్‌బాషా, నాయబ్ రసూల్, జహార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి పలువురి సంతాపం



డీఏ కోటయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దివి శివరాం

ఉలవపాడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న సీనియర్ నాయకుడు డీఏ కోటయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఈయన ఉలవపాడు సొసైటీ అధ్యక్షుడిగా, ఒంగోలు కోఆపరేటీవ్ బ్యాంక్ డైరెక్టర్‌గా, ఒంగోలు సూపర్ బజార్ డైరెక్టర్‌గా, మండల పరిషత్ వైస్ ఎంపీపీగా, జడ్పీటీసీగా వివిధ పదవుల్లో కొనసాగారు. విషయం తెలుసుకున్న కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం మృతదేహాన్ని సందర్శించారు. ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం కుటుబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా పొడపాటి సుధాకర్, మండలంలోని పలువురు టీడీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు కోటయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం



కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతను వివరిస్తున్న సభ్యులు

కందుకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి రోజున శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు చేయాలని మానవ రూపంలో అవతరించిన భగవంతుడు ఆయనను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు కందుకూరు పట్టణం సాయినగర్‌లో ఆదివారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. పూర్వం శ్రీకృష్ణాష్టమి 11 రోజులపాటు చేసేవారని, చివరిగా చవితి రోజున ఊరేగింపు చేసి ముగించేవారని తెలిపారు. ఊరేగింపు చేసిన గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు, రోగాల బాధలు ప్రజలకు ఉండేవి కావ ని ఒక నమ్మకం ఉండేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుధాకర్, వెంకటేశ్వర్లు, నరసింహులు, కృష్ణారెడ్డి, ఎస్ లక్ష్మి, రమ్యశ్రీ, కొండలరావు పాల్గొన్నారు.

మండల సమావేశానికి గైర్హాజరైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా!



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్

సంగం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి గైర్హాజరైన మండలస్థాయి అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో షాలెట్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు హాజరయ్యే సమావేశనికి అన్నిశాఖల మండలస్థాయి అధికారులు హాజరై సమస్యలపై సమాధానాలు చెప్పాలన్నారు. కానీ ఈ సమావేశానికి రెవెన్యూ, ఆర్అండ్‌బీ, విద్యుత్, అటవీ, ఇరిగేషన్ అధికారులు గైర్హాజరవడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై గైర్హాజరైయ్యే అధికారులను ఉపేక్షించేది లేదన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జ్ఞానప్రకాష్ మాట్లాడుతూ మండలానికి మరో 50 గోకుల షెడ్లు మంజూరయ్యాయని చెప్పడంతో గతంలో నిర్మించిన గోకుల షెడ్లకు బిల్లులు ఇవ్వలేదని సభ్యులు నిలదీశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పోలేరమ్మ విగ్రహం పునఃప్రతిష్ఠ



పోలేరమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

ఏఎస్ పేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చిరమన గ్రామంలోని శివాలయం విధిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా ప్రత్యేక హోమాలు నిర్వహిస్తూ వేద మంత్రాలతో ప్రత్యేక హోమాలు, పూజలు జరిపించారు. కంకణధారణ చేసుకున్న వారు అమ్మవారి పూజలు చేశారు. కార్యనిర్వాహకులు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, నరసింహారెడ్డి, కర్నాటి మధుసూదనరెడ్డి, రామిరెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మన ఆలోచనలే మన భవిష్యత్



మాట్లాడుతున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ ప్రకృతి ఉమామహేష్

ఆత్మకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆలోచనలు విత్తనం అయితే, జీవితం ఆ విత్తనం నుంచి వచ్చిన ఒక మహావృక్షమని, మన ఆలోచనలతోనే మన భవిష్యత్ రూపుదిద్దుకుంటుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్, పీఎఫ్ డబ్ల్యూ గ్లోబల్ వ్యవస్థాపకుడు ప్రకృతి ఉమామహేష్ తెలిపారు. పట్టణ సమీపంలోని తిరునాళ్లతిప్పలో వెలసి ఉన్న కాశీనాయన ఆశ్రంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ శిబిరంలో 'భిన్నంగా ఆలోచించు, ఎక్కడైనా ఎప్పుడైనా ఆనందంగా ఉండడం'పై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మనిషిలో ఆనందం, ప్రశాంతత పెరిగేకొద్ది అతని విజయాలు, శక్తిసామర్థ్యాలు పెరుగుతాయని తెలిపారు. మనశ్శాంతి పొందాలంటే మనస్సును సాత్వికగుణంలో ఉంచుకోవడానికి ధ్యానం ఒక్కటే మార్గమని తెలిపారు. ధ్యానంతో బుద్ధి బలం పెరగడంతో పాటు శరీరంలో రోగాలు దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు చంద్రా విజయలక్ష్మి, రమణయ్య, మూరంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు సూచిస్తున్న సీఐ వెంకటరావు

ఉదయగిరి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ ఎన్.వెంకటరావు అన్నారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఆటోడ్రైవర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ఆటోలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిం చుకుని ప్రమాదాలకు గురికావద్దన్నారు. ప్రతిఒక్కరూ లైసెన్సు కలిగి ఉండి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అలాగే పంచాయతీ బస్టాండ్ వ్యాపా రస్తులతో మాట్లాడారు. మార్జిన్‌లను ఆక్రమించి వాహన రాకపోకలకు ఇబ్బం ది కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండ్ వైశాల్యం తక్కువగా ఉన్నందున అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఘనంగా పొంగళ్లు

వింజమూరు, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎర్రబెల్లిపాలెంలో వెలిసి ఉన్న శ్రీపోలేరమ్మ తల్లి అమ్మవారికి ఘనం గా పొంగళ్లు నిర్వహించారు. శుక్రవారం నిలుపుతో మొదలు పెట్టిన ఉత్సవాలు శనివారం అమ్మవారి బ్రహ్మోత్సవం, ఆదివారం అమ్మవారికి పొంగళ్లు, అన్నదానంతో ఉత్సవాలను ముగించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

ఉదయగిరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో 'అన్నదాత సుఖీభవ' పథకం అన్నదాతలకు అండగా ఆదుకుంటుందని నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పథకం సొమ్మును ప్రభుత్వం రైతు ఖాతాలకు జమ చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. వైసీపీ తన ఐదేళ్ల పాలనలో రైతులను నిర్వీర్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పార్టీలకతీతంగా ప్రతిఒక్కరికి ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. వ్యవసాయరంగంలో యాంత్రీకరణ తీసుకొచ్చి రైతులను అన్నివిధాల ఆదుకుంటూ లాభసాటిగా మారుస్తుందన్నారు.

కాశీరావు పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జనసేన మండల నాయకులు

సీతారామపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావు పుట్టిన రోజు వేడుకలను ఆదివారం భోగినేని కాశీరత్తయ్య (గాంధీ) ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, జాషువా, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, తోట మనోజ్, రాజశేఖర్, తోట మాల్యాద్రి, తోట ఏడుకొండలు, వీకాష్‌బాబు, కొత్త జగదీష్, తోట నవీన్, గౌస్, రాజేష్, కిరణ్, జనసేన మండల, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతి చెందిన నాలుగు కుటుంబాల సభ్యులకు ఒక్కొరికి రూ.10,000 వంతున రూ.40,000 సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఆదివారం వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. 2వ వార్డు పరిధిలోని షేక్ షరిఫున్నీసా, 4వ వార్డు పరిధిలో చల్లా సునీత, 13వ వార్డులో ఆత్మకూరు పెంచలయ్య, 23వ వార్డులో డీ.సుధాకరాచారి కుటుంబాలను ఆయన పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు చెరుకూరు తిరుపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



నాగార్పమ్మదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు

భక్తిశ్రద్ధలతో నాగార్పమ్మదేవికి పూజలు

సంగం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న పురాతన నాగార్పమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్నానది జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం క్షీర, సకల ద్రవ్య, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆలయాల అభివృద్ధికి నిధుల మంజూరు



నిధుల మంజూరు పత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని 10 ఆలయాలకు, మండలంలోని 20 ఆలయాలకు దూపదీప నైవేద్యాలకు, అర్చకులకు, ఆలయాల అభివృద్ధికి సీజీఎఫ్ గ్రాంటు కింద నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం టీడీపీ నేతలు సంబంధిత ఆలయాల అర్చకులకు, నిర్వాహకులకు నిధులు మంజూరు పత్రాలను అందజేశారు. ఆత్మకూరు పట్టణంలోని కృష్ణ మందిరం ఆలయానికి రూ.5 లక్షలు, మురగళ్లలోని ఆలయానికి రూ.5 లక్షలు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి తోడేటి వెంకటయ్య, రూరల్ అధ్యక్షులు సుంకర పెంచలచౌదరి, టీడీపీ సీనియర్ నాయకులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, మద్దినేని నారాయణ, పచ్చా పిచ్చయ్యచౌదరి పాల్గొన్నారు.